
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 7 నవంబరు 2024



ధాన్యం కొనుగోలుకు రెడీ

అన్నదాతలు పండించిన ధాన్యం కొనుగోలుకు అధికారులు రెడీ అయ్యారు. ఈ నెల 15 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 302 కేంద్రాల ద్వారా 5.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా యూనిట్‌గా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



వరికోతకు సిద్ధంగా ఉన్న పొలం

జిల్లాలో 302 కేంద్రాల ఏర్పాటు

- వివరాలు ఆన్‌లైన్ అయిన 48 గంటల్లో నగదు జమ
- 5.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం
- జిల్లా యూనిట్‌గా పరిగణనలోకి తీసుకోవాలని రైతుల వినతి

15 నుంచి కొనుగోళ్లు ప్రారంభం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఖరీఫ్ సీజన్ వరికోతలు ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ఆరంభం కానున్నాయి. గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాదైనా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేస్తారా, లేదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ-క్రాప్, ఈకేవైసీలో రైతుల పేర్లు, వారు సాగు చేసిన పంటల వివరాలు పూర్తిస్థాయిలో నమోదు అయితేనే రైతులు పండించిన ధాన్యం విక్రయించేందుకు, ధాన్యం నగదు వెంటనే బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేందుకు అవకాశం ఉంటుంది. రైతుల వేలిముద్రలు ఈకేవైసీలో నమోదు అయితేనే ఈ-క్రాప్‌లో రైతులు సాగుచేసిన పంట వివరాలు పౌర సరఫరాలశాఖ లాగిన్‌లో కనిపిస్తాయి.

ఏ మిల్లుకైనా ధాన్యం విక్రయించుకోవచ్చు

రైతులు వారికి దగ్గరలోని ఏ రైస్ మిల్లుకైనా ధాన్యం విక్రయించే వెసులుబాటును కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కల్పించింది. రైతులు తమకు నచ్చిన, మద్దతుధర అధికంగా ఇచ్చే మిల్లులకు ధాన్యం విక్రయించుకునేందుకు అవకాశం కల్పించినా, గతంలో ఉన్న మాదిరిగానే గ్రామం యూనిట్‌గానే ఆన్‌లైన్‌లో ధాన్యం వివరాలను నమోదుచేసే ప్రక్రియను అలానే ఉంచింది. దీంతో ఆ గ్రామ పరిధిలోని కొన్ని రైస్ మిల్లులకు మాత్రమే రైతులు ధాన్యం ఆన్‌లైన్‌లో విక్రయించుకునే అవకాశం ఉంది. ధాన్యం విక్రయాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా రైతు సేవా కేంద్రాల నుంచి జిల్లాలోని ఏ మిల్లుకైనా ధాన్యం పంపేందుకు జిల్లా యూనిట్‌గా పరిగణించాలని రైతులు కోరుతున్నారు. ఈ అంశంపై ఇంకా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ధాన్యం కొనుగోలు అంచనా 5.50 లక్షల టన్నులు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.64లక్షల హెక్టార్లలో వరిసాగు చేశారు. గతంలో ఏటా 13.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చేది. ఈ ఏడాది బుడమేరుకు వరదలు, భారీవర్షాల కారణంగా వరిపైరు కొంతమేర దెబ్బతింది. దీంతో ఈ ఏడాది జిల్లాలో 9.79 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారుల అంచనా. ఈ ఏడాది జిల్లాలో 5.50 లక్షల టన్నుల ముతకరకాల ధాన్యం 302 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. మిగిలిన బీపీటీ-5204 ఇతర సన్నరకాల ధాన్యం రైతులు బహిరంగ మార్కెట్‌లో తమకు నచ్చిన ధరకు విక్రయించుకుంటారు.

ఎ-గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2,320

ఈ ఏడాది ఎ-గ్రేడ్ ధాన్యం క్వింటా రూ.2,320, సాధారణ రకం ధాన్యం రూ. 2,300గా మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ధాన్యంలో తేమశాతం 17పాయింట్లు ఉంటేనే పూర్తిస్థాయి మద్దతు ధర లభిస్తుంది. ప్రస్తుతం వరి కోత యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేసిన ధాన్యంలో 26 నుంచి 28శాతం తేమ ఉంటోంది. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించే నాటికి తేమ శాతం 17 పాయింట్లకు తగ్గించేందుకు రైతులు ధాన్యం ఆరబెట్టాల్సి ఉంది. తేమశాతం 17 పాయింట్ల కన్నా అధికంగా ఉంటే ఒక్కో పాయింటుకు ధాన్యం మద్దతు ధరను బట్టి రూ.23 చొప్పున ధాన్యం ధరలో కోత పడుతుంది.

జిల్లాలో 149 రైస్ మిల్లులు


జిల్లాలో 149 రైస్ మిల్లులున్నాయి. మరో మూడు మిల్లులకు ధాన్యం మరపట్టేందుకు అవకాశం ఉన్నా సాంకేతికపరమైన అంశాలు, ఇతరత్రా కారణాలతో వీటికి ఈ ఏడాది ఇంకా అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు ఉన్న మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలను చూపితేనే ధాన్యం మరపట్టేందుకు ప్రభుత్వం ఇస్తుంది. బ్యాంకు గ్యారెంటీలను చూపే ప్రక్రియను ఇంకా రైస్‌మిల్లర్లు ప్రారంభించలేదు. వరికోతల ప్రారంభ దశలో ధాన్యంలో తేమశాతం అధికంగా ఉండటంతో ముందస్తుగా డ్రయ్యర్‌లు ఉన్న మిల్లులకు ధాన్యం ఇవ్వడం జరుగుతుంది. ఈ సదుపాయం ఉన్నమిల్లుల యజమానులు వారంరోజులలో బ్యాంకు గ్యారెంటీ చూపాలని సూచించినట్లు పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు.

యంత్ర పరికరాలు అవసరం

జిల్లాలో ఏర్పాటు చేయనున్న 302 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం కొలిచే పరికరం, కాటా మిషన్, డీసీ గ్రేడింగ్

మిగతా 6లో..

ఆయన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హోదాలో పనిచేస్తున్నారు. నెలకు ప్రభుత్వం నుంచి జీతం రూపంలో సుమారు రూ.50 వేలు తీసుకుంటున్నారు. ఇది సరిపోకపోవడంతో నిరుపేద చర్మ కార్మికుడి అవతారమెత్తారు. ప్రభుత్వం పేద చర్మ కార్మికులకు ఇచ్చే పింఛన్ రూ.7 వేలు కూడా తీసుకోవడం మొదలు పెట్టారు. తన పైఅధికారే ప్రభుత్వాన్ని మోసం చేసి దర్జాగా పింఛన్ తీసుకుంటుంటే.. తాను ఎందుకు చేయకూడదని సహకార సంఘంలో గుమస్తా కూడా నిరుపేద డప్పు కళాకారుడి అవతారమెత్తారు. ఆయన కూడా నెలకు రూ.7 వేల పెన్షన్ తీసుకోవడం మొదలు పెట్టారు. నందిగామ మండలంలోని గోళ్లమూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉద్యోగుల నిర్వాకం ఇది.





కటారపు రామారావు, కటారపు గోవర్ధన్‌రావు పెన్షన్ పత్రాలు

డబుల్ ధమాకా

గోళ్లమూడి పీఏసీఎస్‌లో ఉద్యోగుల నకిలీ పెన్షన్ నిర్వాకం

సహకార సంఘం సీఈవోగా విధులు.. చర్మ కార్మికుడి పింఛన్

సహకార సంఘం గుమస్తా.. డప్పు కళాకారుడిగా పింఛన్

- ప్రభుత్వ జీతం తీసుకుంటూనే పెన్షన్‌తో లబ్ధి
- 2019 నుంచి నెలకు రూ.7 వేల చొప్పున..
- వైసీపీ హయాంలో అధికారం అడ్డు పెట్టుకుని..
- గ్రామస్థుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన ఘటన
- గుమస్తా సస్పెన్షన్.. సీఈవోపై వేటుకు మీనమేషాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ప్రభుత్వ సొమ్మును దోచుకు తిన్నారనడానికి నిలువెత్తు నిదర్శనం ఈ ఉదంతం. నందిగామ మండలంలోని గోళ్లమూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కటారపు రామారావు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉన్నారు. ఆయన కుమారుడు గోళ్లమూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, సర్పంచ్. తన కుమారుడి మిగతా 6లో..

రూ. 128 కోట్లతో జిల్లాలో సబ్ స్టేషన్ల నిర్మాణం

నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు 6లో

ఎక్కడైనా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో స్వేచ్ఛగా ఇసుక తీసుకెళ్లవచ్చని సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన దళారులకు వరంగా మారింది. టీడీపీ, వైసీపీ కార్యకర్తలు కుమ్మక్కై, మరీ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. క్వారీల్లో సేవ చేస్తున్నామంటూ బాట ఖర్చు పేరుతో ట్రాక్టర్‌కు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. డబ్బులు తీసుకుని బాట ఏర్పాటు చేయక పోవడంతో ట్రాక్టర్లు తిరగబడిపోతున్నాయి. ఇసుక అక్రమాలపై ఆరోపణలు వచ్చిన కళ్లంవారిపాలెం క్వారీని మూసివేయించిన అధికారులు చాగంటిపాడు, భద్రిరాజుపాలెం క్వారీల్లోను అవే పరిస్థితులు నెల కొన్నా కన్నెత్తి చూడకపోవటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



క్వారీలో ఇసుక ట్రాక్టర్లు

భద్రిరాజుపాలెం క్వారీలో ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ 200 చొప్పున వసూలు చేసినట్లు రాసుకున్న పుస్తకం

దోచుకున్నోడికి దోచుకున్నంత

తోట్లవల్లూరు మండలంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- చాగంటిపాడులో యంత్రంతో లోడింగ్
- భద్రిరాజుపాలెంలో పుస్తకం పెట్టి మరీ వసూళ్లు
- ఐలూరులో ఓ రైతు అడ్డగింతపై దళితుల రగడ

తోట్లవల్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలంలో ఉచిత ఇసుక అమలు తీరు అస్తవ్యస్తంగా మారింది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఇసుక దోచుకున్న తీరు విమర్శలకు గురయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు ప్రజలకు చవకగా ఇసుక లభించాలని ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రకటించారు. దీంతో ఈ ఉచిత పథకాన్ని సొమ్ము చేసుకునేందుకు టీడీపీ, వైసీపీ కార్యకర్తలు తయారయ్యారు. కళ్లంవారి పాలెం క్వారీలో వైసీపీ నేత ఇసుక మాఫియా నిర్వహిస్తున్నారని ఆరోపణలు రావటంతో ఆ క్వారీని మూత వేసిన అధికారులు చాగంటిపాడు, భద్రిరాజుపాలెం క్వారీలను మాత్రం గాలికి వదిలేశారు. చాగంటిపాడులో కార్మికులు ఇసుక పోసి ఒక ట్రాక్టర్‌కి రూ.1000 వసూలు చేస్తున్నారు. కొందరు టీడీపీ కార్యకర్తలు దగ్గరుండి కార్మికుల నుంచి ప్రతి ట్రాక్టర్‌కు బాట ఖర్చుకంటూ రూ.200 వసూలు చేస్తున్నారు. అయితే బయటి గ్రామాల ట్రాక్టర్‌లను రానీయకుండా అడ్డుకోవటం విమర్శలకు దారితీసింది. కార్మికులు ఒకవైపు ఇసుక పోస్తుండగా మరో వైపు ఏకంగా ఎక్సకవేటర్‌నే క్వారీలోకి ప్రవేశపెట్టడం దుమారం రేపుతోంది.

టీడీపీ, వైసీపీ కుమ్మక్కై వసూళ్లు

భద్రిరాజుపాలెంలో టీడీపీ, వైసీపీ వారు కలిసి క్వారీలో ఒక్కో ట్రాక్టర్ నుంచి బాట ఖర్చుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడా బాట నిర్మించిన దాఖలాలు లేవు. ఇసుకలోనే ట్రాక్టర్లు నడుస్తూ దిగబడిపోతున్నాయి. భద్రిరాజుపాలెం క్వారీలో ఏకంగా పుస్తకంలోనే రూ.200 వసూలు చేస్తున్నట్టు రాయడం గమనార్హం. ఈ క్వారీలో కూడా ట్రాక్టర్‌కి ఇసుక పోసి రూ.1000 వసూలు చేస్తున్నారు.

అధికారులకు వాటాలు!

క్వారీల్లో బాట ఖర్చుల పేరుతో వసూలు చేస్తున్న డబ్బులను రెవెన్యూ, పోలీస్ అధికారు లకు కొంత ఇచ్చి మిగిలినది క్వారీలో నిర్వాహకులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఫలితంగానే అధికారులెవ్వరు ఈ క్వారీల వైపు కన్నెతి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

వినియోగదారులపై భారం

గతంలో టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేసినపుడు ట్రాక్టర్ ఇసుక నింపిన కార్మికులకు రూ.300 మాత్రమే వసూలు చేసేవారు. క్వారీ వద్ద రూ.300 మించి వసూలు చేయకూడదని బ్యానర్ కట్టి పకడ్బందీగా ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేశారు. దాంతో ఉయ్యూరుకి రూ.1,500లకు ట్రాక్టర్ ఇసుక లభించేది. ఇప్పుడు క్వారీల్లోనే అధిక రేటు వసూలు చేయటంతో రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు వినియోగదారులు చెల్లించాలి వస్తోంది. దీంతో సీఎం చంద్రబాబు ఆశయం పూర్తిగా నీరుగారి పోయిందని పలువురు అంటున్నారు.



చాగంటిపాడు క్వారీలో ఇసుక పోసేందుకు వచ్చిన ఎక్సకవేటర్

దళితుల ఆందోళన

ఐలూరులో కొన్ని రోజుల పాటు ఉచిత ఇసుక తవ్వకాలు జరగ్గా రెండు రోజుల నుంచి ఓ భూస్వామి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లకుండా తన కారుని రహదారికి అడ్డంగా పెట్టటంపై బుధవారం దళితులు ఆందోళన నిర్వహించారు. తమకు ఇసుక తవ్వుకునే అవకాశం కల్పించకుంటే దళిత సంఘాలతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

మేం జోక్యం చేసుకోలేం : తహసీల్దార్

ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ఉచిత ఇసుక తవ్వకాలపై తాము జోక్యం చేసుకోలేమని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి ఆంధ్రజ్యోతికి తెలిపారు. కావాలంటే జీవో చూసుకోమని పేర్కొన్నారు. ఉచిత ఇసుక క్వారీలంటూ ఎక్కడా లేవన్నారు. రొయ్యూరులో రెండు, నార్తువల్లూరులో మూడు క్వారీలకు మాత్రమే అధికారికంగా అనుమతి ఉందని, అక్కడ ఇంకా తవ్వకాలు జరపటం లేదన్నారు. మిగతాచోట్ల జరిగే ఉచిత ఇసుక తవ్వకాలపై తామేమి చేయలేమని స్పష్టం చేశారు.

- పటమటకు చెందిన అక్రమ బియ్యం వ్యాపారి శివప్రసాద్ కిందటి నెల 25వ తేదీన పేదల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. తిరిగి ఈ నెల 4న రెండోసారి పోలీసులకు దొరికిపోయాడు.
- సెప్టెంబరులో పరిటాల రైస్‌మిల్లులో పోలీసులు అక్రమ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆ మరుసటి నెలలో సివిల్ సప్లయిస్ మంత్రి ఆ మిల్లును తనిఖీ చేయగా, అక్రమ బియ్యం కనిపించింది.
- మచిలీపట్నానికి చెందిన అక్రమ బియ్యం డాన్‌పై గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా బహిష్కారం విధించారు. తిరిగి కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా అక్రమ బియ్యం వ్యాపారం చేసిన అతను ప్రస్తుతం కూడా అదే పనిలో నిమగ్నమయ్యాడు.
- అక్రమ బియ్యం వ్యాపారం చేస్తున్న రెండు ప్రధాన ముఠాల ఆధిపత్యపోరుతో ఏ.కొండూరులో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా పేదలకు అందాల్సిన అక్రమ రేషన్ బియ్యాన్ని ముఠాలు తన్నుకు పోతుంటే.. ఆధిపత్య పోరులో ఒకరినొకరు తన్నుకుంటుంటే.. పట్టించుకోవాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. విజయవాడ కేంద్రంగా పటమట, సింగ్‌నగర్, ఏ.కొండూరు, జి.కొండూరు, తిరువూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం మండలాల్లో భారీ ఎత్తున డాన్లు పుట్టుకొస్తున్నా.. అక్రమ బియ్యం వ్యాపారం భారీగా జరుగుతున్నా.. దేశాలు దాటిపోతున్నా అడిగేవారు కరువయ్యారు.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా యథేచ్ఛగా అక్రమ బియ్యం వ్యాపారం

- అన్నీ తెలిసినా పట్టని సివిల్ సప్లయిస్ అధికారులు
- పోలీసులు పట్టుకుంటేనే డాన్‌ల బాగోతం బట్టబయలు
- అయినా సరిహద్దులు దాటించేస్తున్న వ్యాపారులు
- సింగ్‌నగర్, పటమట కేంద్రంగా డాన్‌ల వ్యాపారం
- ఏ.కొండూరులో వ్యాపారుల మధ్య ఆధిపత్యపోరు
- ఒకరినొకరు కార్లతో ఢీకొని రచ్చకెక్కిన వివాదాలు





పటమట పోలీసులకు వరుసగా రెండోసారి పట్టుబడిన డాన్ శివప్రసాద్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్టీఆర్ జిల్లాలో అక్రమ బియ్యం వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా సాగుతోంది. పటమట పోలీసులకు వరుసగా రెండుసార్లు పట్టుబడిన అక్రమ బియ్యం వ్యాపారి శివ ప్రసాద్‌పై కానీ, మచిలీపట్నం బియ్యం డాన్‌పై కానీ, విజయవాడ, ఏ.కొండూరు, ఇబ్రహీంపట్నం బియ్యం వ్యాపారులపై కానీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా సివిల్ సప్లయిస్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. సాధారణంగా రెండోసారి పట్టుబడితే డీలర్‌షిప్ రద్దుచేసే అధికారం ఉన్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రెండు జిల్లాల్లో రేషన్ మాఫియా విచ్చలవిడిగా పడగ విప్పుతోంది. ముఠాలుగా ఏర్పడి దాడులు చేసుకునే వరకూ వెళ్లింది. ఇటీవల ఏ.కొండూరు మండలంలో రెండు రేషన్ మాఫియా ముఠాలు సినీఫక్కీలో పరస్పరం కార్లతో ఢీకొనడం వివాదాస్పదమైంది.

చైన్ లింక్ ద్వారా వ్యాపారం

ఎన్టీఆర్ జిల్లాలో మండలానికి ఒక డాన్ ఉన్నాడు. వీరందరికీ 12 మంది మాస్టర్ డాన్‌లు ఉన్నారు. మండల స్థాయిలో డాన్‌ల వివరాలు సివిల్ సప్లయిస్ అధికారులకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, విజిలెన్స్ అధికారులకు తెలిసినా పట్టించుకోవట్లేదు. ఈ రిసైక్లింగ్ అంతా ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది. చైన్ లింక్‌లా సేకరించిన బియ్యమంతా డాన్‌కు విక్రయిస్తారు. మండల స్థాయిలోని డాన్‌లు ఈ బియ్యాన్ని రైస్ మిల్లులకు, చేపల చెరువులకు, ఫ్లోర్‌మిల్లులకు, పోర్టులకు తరలిస్తారు. ఇలా బియ్యం ఇతర దేశాలకు తరలిపోతోంది. ఇలాంటి వారందరినీ కొంతమంది యూట్యూబర్లు సమాచారం ఇచ్చి పట్టిస్తే తప్ప సివిల్ సప్లయిస్ అధికారులు క్షేత్రస్థాయిలో స్పందించట్లేదు. పోలీసులు పదేపదే అక్రమ బియ్యం వ్యాపారులను పట్టుకుంటున్నా సివిల్ సప్లయిస్ అధికారుల్లో మాత్రం స్పందన లేదు.

సింగ్‌నగర్‌లో బడాడాన్

సింగ్‌నగర్ వేదికగా ఓ డాన్‌గా అక్రమ బియ్యం సామ్రాజ్యాన్నే నడుపుతున్నాడు. నగరంలోని చాలామంది బియ్యం వ్యాపారులతో ఈ డీలర్‌కు సంబంధాలున్నాయి. సివిల్ సప్లయిస్ అధికారులకు బాగా ఇష్టుడు. వీరంతా ముద్దుగా రింగ్ మాస్టర్ అని పిలుచుకుంటారు. బీఆర్‌టీఎస్ రోడ్డు, సింగ్‌నగర్, వన్‌టౌన్, భవానీపురం, కృష్ణలంకలో బియ్యం వ్యాపారులున్నారు. వీరితో రింగ్ మాస్టర్‌కు సంబంధాలున్నాయి. అలాగే, నున్న, గన్నవరం, ఇబ్రహీంపట్నం

మిగతా 6లో..

దివిలో ఐటీ దాడుల కలకలం!

నాగాయలంకలో రొయ్యల వ్యాపారి ఇల్లు, కార్యాలయాలపై ఏకకాలంలో సోదాలు

వైసీపీ నేత గ్రంధి శ్రీనివాసరావుతో లావాదేవీలే కారణమా! 6లో

తాగునీటి శుద్ధిపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

6లో

దారి దోపిడీకి బ్రేక్

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారికి షోకాజ్

- పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద నిలిచిన ప్రైవేట్ వసూళ్లు
- సంబంధం లేని మరో ఎంవీఐకు కూడా నోటీసు..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద దారి దోపిడీకి పాల్పడుతున్న రవాణా శాఖ అధికారికి ఉన్నతాధికారులు షోకాజు నోటీసు జారీ చేశారు. రెండు నెలలుగా సదరు అధికారి పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని వాహనాలు నిలుపుదల చేయిస్తూ, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విషయాన్ని మంగళవారం సంచికలో 'దారి దోపిడీ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. అయితే, ఈ వ్యవహారంలో అధికారికి నోటీసు ఇచ్చిన ఉన్నతాధికారులు ఈ విషయంతో సంబంధం లేని మరో ఎంవీఐకు కూడా నోటీసు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ విషయంలో మొక్కుబడి విచారణ జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా ఉన్నతాధికారుల స్పందనతో పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట పడింది. విచారణ ముగిసే వరకు క్షేత్రస్థాయిలో విధులు చేపట్టవద్దని ఉన్నతాధికారులు ఆ అధికారిని ఆదేశించినట్టు తెలిసింది. అయితే, ఈ ఉదంతంలో పొట్టిపాడు టోల్‌ప్లాజా నిర్వాహకులపై కూడా విమర్శలు వస్తున్నాయి. టోల్‌ప్లాజా నిర్వాహకులకు, సిబ్బందికి ఇందులో సంబంధాలున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.



గన్నవరంలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

రూ. 128 కోట్లతో కృష్ణాలో సబ్ స్టేషన్ల నిర్మాణం

- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం బాబు
- తొలగనున్న లో ఓల్టేజీ సమస్యలు

పెడన/గన్నవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా వ్యాప్తంగా రూ. 128 కోట్లతో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణాలు చేపట్టగా.. శంకుస్థాపన కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ భాగ్యరాజ్ తెలిపారు. పెడనలో విద్యుత్ శాఖాధికారులతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పెడన, గన్నవరం విమానాశ్రయం, బంటుమిల్లి మండలాల్లో 132/33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఒక్కొక్క సబ్‌స్టేషన్‌కు రూ. 48 కోట్ల చొప్పున మంజూరయ్యాయని తెలిపారు. వీటి నిర్మాణం వల్ల భవిష్యత్తులో ఆయా మండలాలలో లో ఓల్టేజి సమస్య పరిష్కారమవుతుందన్నారు. పెడన మండలంలోని కూడూరు వద్ద నిర్మిస్తున్న 132/33 కేవీ భవిష్యత్తులో 220/33 కేవీగా అప్‌గ్రేడ్ చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో పెడన కేంద్రంగా అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుందని ఆయన పేర్కొన్నారు. గురువారం ఉదయం వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ప్రారంభిస్తారన్నారు. పెడనలో జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, జిల్లా కలెక్టర్ బాలాజీలు హాజరవుతారన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈలు ఎం.సత్యానందం, సత్యనారాయణ, మచిలీపట్నం ఈఈ శ్రీనివాసరావు, పెడన ఏడీఈ సీహెచ్. మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్లను వారం రోజుల్లో క్లియర్ చేయాలి

- ఉద్యోగులతో డీఈవో రామారావు



మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఫైళ్లను త్వరితగతిన వారం రోజుల్లోగా క్లియర్ చేయాలని డీఈవో రామారావు ఉద్యోగులను ఆదేశించారు. బుధవారం డీఈవో కార్యాలయంలో వివిధ సెక్షన్ల ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారంరోజుల్లో ఏ ఫైల్ అయినా క్లియర్ చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఏడీలు, సూపరింటెండెంట్‌లు తమ తమ సెక్షన్ల పరిధిలో ఉండే ఫైళ్లను బేరీజు వేసుకోవాలన్నారు. ఉద్యోగుల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఉద్యోగ సంఘ నేత పవన్‌కుమార్ తదితరులు కోర్టు కేసుల్లో జాప్యంపై వివరించారు. దీనికి డీఈవో మాట్లాడుతూ, కోర్టు కేసులను స్వయంగా పరిశీలిస్తానన్నారు. కార్యక్రమంలో ఏడీ మనోహరనాయక్, సూపరింటెండెంట్ పవన్ తదితరులు సమస్యలను డీఈవో ముందుంచారు.



సీడీని ఆవిష్కరిస్తున్న శ్రీరాం తాతయ్య, పెనుగొండ రాజీవ్

వాసవీ మాత భక్తిగీతాల సీడీ ఆవిష్కరణ

జగ్గయ్యపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కైకలూరుకు చెందిన విద్యాంజలి విద్యాసంస్థల అధినేత, ప్రిన్సిపాల్ సయ్యద్ జమీల్ అహ్మద్ ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారిపై స్వయంగా రచించి, గానం చేసిన ఆడియో సీడీని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. మతమేదైనా సాహిత్యం, భక్తికి అడ్డు కాదని జమీల్ అహ్మద్ నిరూపించారని ప్రశంసించారు. వాసవీ కన్యక పరమేశ్వరీ జీవిత చరిత్రను చదివి స్ఫూర్తిని, ఆర్తిని పొంది పాటలు రాసి అందరికీ చేరువ చేయాలని సీడీని విడుదల చేస్తున్నట్టు రచయిత, గాయకుడు జమీల్ అహ్మద్ అన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట దేవస్థానం ధర్మకర్త, జేఆర్సీ విద్యాసంస్థల సెక్రటరి పెనుగొండ రాజీవ్, ఏపీఎంపీఏ అధ్యక్షుడు కాకరపర్తి వెంకట రమేష్, ఆర్యవైశ్య నేత గెల్లా వైకుంటేశ్వరరావు, టీడీపీ నేతలు పైడిమర్రి మాల్యాద్రి, వెంకటస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు

- ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



కూచిపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుకను సొంత అవసరాలకు కాకుండా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా హెచ్చరించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండేటి ఇందిరా అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇసుక ఇబ్బందులను తొలగించి అందరి అవసరాలు దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. దుర్వినియోగం చేస్తే సహించేది లేదన్నారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములవుదామన్నారు.

పాండురంగని ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 13న రథోత్సవంలో ఏనుగు అంబారీ



మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు కొంగుబంగారం చిలకలపూడి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. 11న విఠలకోటి పూజ, లక్ష్మీగణపతి హోమం, పల్లకీ ఉత్సవాలు, 12న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, బ్రహ్మోత్సవం జరుపుతారు. మంగళవారం రాత్రి 7 గంటలకు రుక్మిణీ పాండురంగ స్వామి కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు చేశారు. 13న పాండురంగ స్వామి వారి రథోత్సవం ఉదయం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించనున్నారు. రథోత్సవంలో కేరళ నుంచి ఏనుగు అంబారీని తీసుకురావడానికి మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక చొరవ చూపారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు చలమలశెట్టి నరసింహారావుతో పాటు నగర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొననున్నారు. మేళతాళాలతో జరిగే ఈ ఊరేగింపులో ఆశాంతం కోలాటం, పగటి వేషధారణలు, ఊరేగింపులో పాల్గొంటారు. 13న దేవాలయ ప్రాంగణంలో భక్తబృందం 700 శ్లోకాల సంపూర్ణ భగవద్గీత పారాయణ చేస్తారు. 14న విష్ణుసహస్రనామ పారాయణ, సహస్ర దీపారాధనలు జరుగుతాయి. 15న రుక్మిణి అమ్మవారికి కుంకుమపూజలు, పల్లకీ ఉత్సవాలు, గోపాలక ఉత్సవాలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు టీకే నరసింహం తెలిపారు.

దివిలో ఐటీ దాడుల కలకలం!

- నాగాయలంకలో రొయ్యల వ్యాపారి ఇల్లు, కార్యాలయాలపై ఏకకాలంలో సోదాలు
- వైసీపీ నేత గ్రంధి శ్రీనివాసరావుతో లావాదేవీలే కారణమంటున్న ఆక్వా వర్గాలు



దివి ప్రాంతంలో ఐటీ దాడుల్లో పాల్గొన్న సిబ్బంది

అవనిగడ్డ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక మండలానికి చెందిన ప్రముఖ రొయ్యల వ్యాపారి చెన్ను లక్ష్మణరావు ఇల్లు, కార్యాలయం, ఐస్‌ఫ్యాక్టరీలపై బుధవారం ఐటీదాడులు దివిప్రాంతంలో సంచలనం రేకెత్తించాయి. బుధవారం ఉదయం చెన్ను లక్ష్మణరావుకు చెందిన ఐస్ ఫ్యాక్టరీ, నాగాయలంకలోని ఇళ్లపై తెలంగాణ నుంచి వచ్చిన ఐటీ అధికారులు దాడులు నిర్వహించి సోదాలు చేపట్టారు. లక్ష్మణరావు స్వగృహమైన ఈలచెట్లదిబ్బ గ్రామంలోనూ, మోపిదేవి మండలం వార్పు సమీపంలో కొద్దికాలం క్రితం ప్రారంభించిన ఐస్‌ఫ్యాక్టరీలపై ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

వైసీపీ నేత గ్రంధి శ్రీనివాస్‌తో వ్యాపార సంబంధాలే కారణమా?

నాగాయలంకలో రొయ్యల వ్యాపారిగా ఉన్న చెన్ను లక్ష్మణరావు ఐఆర్‌జి కంపెనీ అధినేత, వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌తో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. గ్రంధి శ్రీనివాస్‌పై ఆరోపణల నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన కార్యాలయాలు, దిగుమతి కేంద్రాలపై దాడులు నిర్వహించిన ఐటీ అధికారులు అదే సమయంలో నాగాయలంక, మోపిదేవి, ఈలచెట్లదిబ్బ ప్రాంతాల్లో చెన్ను లక్ష్మణరావుకు చెందిన వ్యాపార కేంద్రాల్లోనూ, సన్నిహితుల ఇళ్లలోనూ, ఐస్ ఫ్యాక్టరీలోనూ దాడులు నిర్వహించారు. తెలంగాణ నుంచి సుమారు 10 కార్లలో ఐటీ అధికారులు ఈ దాడుల్లో పాల్గొనేందుకు వచ్చినట్టు సమాచారం. ఐఆర్‌జి కంపెనీతో చెన్ను లక్ష్మణరావు లావాదేవీల్లో భాగంగా సుమారు రూ.77 నుంచి రూ.200 కోట్ల మేర జరిగిన లావాదేవీలకు సంబంధించి లెక్కలు లేవని ఐటీ అధికారులు తేల్చినట్టు విశ్వసనీయ సమాచారం.

వ్యాపార వర్గాల్లో కలకలం..

రాష్ట్రంలోనే ప్రధానమైన ఆక్వాసాగులో అవనిగడ్డ నియోజకవర్గంలో రొయ్యల దిగుమతి వ్యాపారాలు నిర్వహిస్తున్న చెన్ను లక్ష్మణరావుపై ఐటీ అధికారులు దాడులు నిర్వహించటంతో ఈ ప్రాంత వ్యాపారులు ఉలిక్కిపడ్డారు. నిత్యం కోట్లాది రూపాయల విలువైన మత్స్యసంపద, రొయ్యలు ఇక్కడి నుంచి దేశవిదేశాలకు ఎగుమతి అవుతుంటాయని, దీనిలో భాగంగా దిగుమతి చేసే కంపెనీలు లావాదేవీలు మొత్తం బ్యాంకుల ద్వారా నిర్వహిస్తుంటాయని, ఇందులో తమకు మిగిలేది కమీషన్ మాత్రమేనని, లావాదేవీలు మొత్తం ఎగుమతి చేసే కంపెనీలకు, రైతులకు మధ్య నేరుగా జరుగుతుంటాయని, అలాంటిది ఓ వ్యాపారిపై పెద్ద ఎత్తున ఐటీ దాడులు జరగటంతో వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రొయ్యల వ్యాపారిగానే కాక పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే లక్ష్మణరావు ఇంటిపై దాడులు స్థానికంగా చర్చనీయాంశమైంది.

డబుల్ ధమాకా

(5వ పేజీ తరువాయి)

అధికారాన్ని, తన హోదాను అడ్డం పెట్టుకుని కటారపు రామారావు చెలరేగిపోయారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తూ నిరుపేదలకు దక్కాల్సిన పింఛన్‌ను దర్జాగా తన ఖాతాలో వేసుకుంటున్నారు. ఐడీ 106800655తో కటారపు రామారావు నెలకు రూ.7 వేల పెన్షన్ తీసుకుంటున్నారు. అలాగే, ఇదే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గుమస్తాగా పనిచేస్తున్న కటారపు గోవర్ధన్‌రావు ఐడీ 106800792తో నెలకు రూ.7 వేల పెన్షన్ తీసుకుంటున్నాడు.

2019 నుంచీ..

వీరిద్దరూ 2019 నుంచి పింఛన్లు పొందుతుండగా, 2024 జూలైలో ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. జిల్లా సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఊర్మిళను విచారణాధికారిగా నియమించారు. ఆమె గతనెలలో విచారణ జరిపి, 22న నివేదికను సహకార శాఖ అధికారికి అందజేశారు. ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు సీఈవో, గుమస్తాపై ఏపీ సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నివేదికలో కోరారు. అదే సమయంలో ప్రభుత్వాన్ని మోసంచేసి సుమారు ఆరేళ్లుగా వారు ప్రభుత్వం నుంచి పింఛన్ రూపంలో పొందిన సుమారు రూ.4 లక్షలను రికవరీ చేయాలని పేర్కొన్నారు. ఈ నివేదికపై స్పందించిన అధికారులు మంగళవారం గుమస్తా కటారపు గోవర్ధన్‌రావుపై సస్పెన్షన్ వేటు వేశారు. సీఈవో రామారావుపై వేటు వేసేందుకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లతోనే వేటు వేయడానికి వెనుకాడుతున్నట్లు సమాచారం.

సభ్యత్వాలపై విచారణ జరపాలి

గోళ్లమూడి సహకార సంఘంలో మొత్తం 875 మంది సభ్యులుగా ఉండగా, వీరిలో అధికశాతం మందికి అసలు భూమే లేదని, అయినా వారిని సభ్యులుగా కొనసాగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై సహకార శాఖ అధికారులకు ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు విచారణ జరపకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. సహకారం సంఘం సీఈవో, గుమస్తా కలిసి రైతులకిచ్చిన రుణాలపై అధిక వడ్డీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి.

రెచ్చిపోతున్న రేషన్ మాఫియా

(5వ పేజీ తరువాయి)

మండలాల కేంద్రంగా దశాబ్దాల నుంచి అక్రమ బియ్యం వ్యాపారం నడిపిస్తున్న డాన్‌లు ఉన్నారు. ఏ.కొండూరు, నందిగామ, జి.కొండూరు, మైలవరం, జగ్గయ్యపేట, గంపలగూడెం, తిరువూరు మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. ఇంతా జరుగుతున్నా ఈ అక్రమ బియ్యం వ్యాపారులపై సివిల్ సప్లయిస్ అధికారులు క్రిమినల్ కేసులు పెట్టట్లేదు. మామూళ్ల కారణంగానే ఇలా చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

అధికారులే కారణం

పేదల బియ్యం పదేపదే రీ సైక్లింగ్ కావడానికి సివిల్ సప్లయిస్ అధికారులే రాచబాటలు వేస్తున్నారు. తనిఖీల్లో పట్టుబడిన అక్రమ రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు తిరిగి ఆక్షన్ వేసి అమ్మేస్తున్నారు. వీటిని అక్రమ బియ్యం వ్యాపారులే కొంటున్నారు. ఇలా బిల్లులు తెచ్చుకుని, నకిలీవి తయారుచేసి, ఆక్షన్‌లో వచ్చిన బియ్యం సహా తమ వద్ద ఉన్న బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యాన్ని ఆక్షన్ పేరుతో కాకుండా, తర్వాత నెల కోటాలో పేదలకు పంచితే ప్రభుత్వంపై కొంతమేరైనా భారం తగ్గుతుంది. రిసైక్లింగ్‌కు అడ్డుకట్ట పడుతుంది.

పీడీఎస్ డీటీల పెత్తనం

జిల్లావ్యాప్తంగా పీడీఎస్ డీటీలు కొందరు రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. సాధారణంగా రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లలో చాలామంది అక్రమ బియ్యం వ్యాపారం చేస్తున్నారు. వీరికిచ్చే కమీషన్ కుటుంబ పోషణకు సరిపోక ఇలా అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిని అడ్డం పెట్టుకుని డీలర్లు, ఎండీయూల నుంచి పీడీఎస్ డీటీలు నెలనెలా రూ.1,500, రూ.2 వేలు, ఆపైన వసూలు చేస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన

విజయవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఒక ప్రచార రథాన్ని ఏర్పాటు చేశారు. ప్రచారంలో భాగంగా పోస్టర్‌ను కమిషనర్ రాజశేఖర్‌బాబు, క్రైమ్స్ డీసీపీ టి.తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు కమిషనర్ ఛాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ ప్రచార రథాన్ని విజయవాడతోపాటు, గ్రామాల్లో తిప్పుతారు.

తాగునీటి శుద్ధిపై ప్రత్యేక దృష్టి

- రుద్రవరానికి డంపింగ్ యార్డు మార్చండి
- చెత్తను ఎప్పటికప్పుడు గుంటూరు తరలించాలి
- కృష్ణా కలెక్టర్ బాలాజీ



హెడ్ వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నంటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాగునీటిని శుద్ధి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలపై కలెక్టర్ స్పందించారు. హెడ్ వాటర్‌వర్క్స్, డంపింగ్‌యార్డును బుధవారం ఆయన ఆకస్మికంగా ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేసేందుకు మునిసిపల్ అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. ముందుగా గుంటూరు జిందాల్‌కు చెత్తను తరలించే వాహనాలకు మరమ్మతులు చేయించాలన్నారు. మరో వాహనం కొనుగోలు చేసి చెత్తను ఎప్పటికప్పుడు గుంటూరు పంపాలన్నారు. ఒక్కో వాహనంలో 9 టన్నుల చెత్త తరలించవచ్చన్నారు. రోజుకు నగరంలో 84 టన్నుల చెత్త వస్తోందని కలెక్టరుకు కమిషనర్ బాపిరాజు వివరించారు. రుద్రవరంలో డంపింగ్‌యార్డుకు కొనుగోలు చేసిన 13 ఎకరాల స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చెత్తరహిత పట్నంగా రూపొందించేందుకు అధికారులు ముందుకు రావాలన్నారు.

మురుగునీటిని బయటకు తోడండి

హెడ్‌వాటర్ వర్క్స్‌ను సందర్శించిన కలెక్టరు మురుగునీటిని వేగంగా బయటకు తోడాలన్నారు. ఫిల్టర్ బెడ్స్‌ను క్లీన్ చేయాలన్నారు. నాలుగు రోజుల్లో పనులు పూర్తి కావాలన్నారు. నగరంలో గొడుగుపేట, భాస్కరపురం, రాజుపేట, హౌసింగ్ బోర్డు కాలనీలలో తాగునీరు కలుషితమవుతోందని వచ్చిన ఫిర్యాదుల మేరకు పరిశీలించాలని మునిసిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కలెక్టర్ పరిశీలనలో హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఫిల్టర్‌బెడ్‌లు మురుగు పట్టి ఉన్నట్టు తేలిందన్నారు. ఫిల్టర్‌బెడ్‌లను పూడిక తీయిస్తున్నామన్నారు. ఈ పని నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనరు బాపిరాజు, మునిసిపల్ చంద్రశేఖర్, డీఈ కుబియా నాయక్ ఏఈ తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హోం శాఖపై పవన్ వ్యాఖ్యలు సరికాదు

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య

గుడివాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హోంమంత్రిత్వ శాఖపై చేసిన వ్యాఖ్యలను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ ఖండించారు. బుధవారం ఒక ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన చేతిలో హోంశాఖ ఉంటే వేరేలా ఉంటుందని పవన్ అనడం సబబు కాదన్నారు. దళితమహిళ హోంశాఖ మంత్రిగా ఉన్న క్రమంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని, వంగలపూడి అనితకు హోంమంత్రిత్వ శాఖ ఇస్తే సరిపోదని, పూర్తిస్థాయి అధికారమిస్తే తానేంటో రాష్ట్రానికి చూపించగల దమ్మున్న మహిళ అని కొనియాడారు. ప్రజా ప్రతినిధుల అధిక జోక్యం వల్లే రాష్ట్రంలో నేరాలు పెరుగుతున్నాయని, పోలీస్ వ్యవస్థకు పూర్తి స్వేచ్ఛనిస్తేనే నేరాలు అదుపులోకి వస్తాయని అన్నారు.

తమ వెనుక నాయకుడున్నాడనే ధీమాతో నేరగాళ్లు రెచ్చిపోతున్నారని, ముఖ్యంగా ప్రజా ప్రతినిధుల జోక్యం బాగా పెరిగిందన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని, కఠినంగా వ్యవహరించాల్సిన చోట పోలీసులకు ప్రజాప్రతినిధులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు చాలాచోట్ల పార్టీలు, కులాలు అడ్డుపడుతున్నాయన్నారు. చట్టాల అమలులో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. మాదిగలకు రాజకీయాలు, అధికారం కొత్త కాదని, అధికారం పూర్తిస్థాయిలో లేకపోవడంతో అసమర్థులుగా చిత్రీకరిస్తున్నారన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో మాయవతి పాలనను ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. వర్గీకరణను రాష్ట్రాలు చేపట్టాలని, సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని కోరారు. ఈ సమావేశంలో చర్మకార, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, ఎంఆర్‌పిఎస్ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు కె.కవిత, నాయకులు బొక్కినాల సాంబశివరావు, కంచర్ల సుధాకర్, తాళ్ళూరి ప్రశాంత్, అద్దంకి మాణిక్యాలరావు, రాజ్‌కుమార్, వేశపోగు సామియేలు, కొడాలి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు రెడీ

(5వ పేజీ తరువాయి)

యంత్ర పరికరాలు, రైతులు తెచ్చిన ధాన్యం శాంపిల్స్ మరపట్టే మినీ మిల్లింగ్ యంత్రం కావాల్సి ఉంది. ధాన్యంలో పాయ, తప్ప, తాలు, కేళీలు, మట్టి, వంకర తిరిగిన గింజలు, పరిపక్వతకాని గింజల పరిమాణాన్ని తెలుసుకునేందుకు పూర్తిస్థాయిలో సాంకేతిక సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. రైతులు వ్యవసాయం కోసం మధ్యవర్తుల వద్ద ముందస్తుగానే పెట్టుబడి తీసుకుంటారు. సంబంధిత మధ్యవర్తులకే రైతులు ధాన్యం విక్రయిస్తారు. మధ్యవర్తులు, మిల్లర్లకు ఉన్న అనుబంధంతోనే ధాన్యం కొనుగోళ్లు జరిగే అవకాశం ఉండటంతో మద్దతుధరలో కోతపెట్టకుండా అధికారులు నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

1.32 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధం

– పృజన, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు

జిల్లాలో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో ఈ నెల 15 నుంచి ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తాం. ఇప్పటికే 1.32 కోట్ల గన్నీ బ్యాగులను సిద్ధం చేశాం. రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నాం. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తాం. రైతు సేవా కేంద్రాలలో పనిచేసే సాంకేతిక సిబ్బందికి ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ కూడా ఇస్తున్నాం.

గూటి కోసం గోడు!

- సమస్యల వలయంలో పలు అంగన్వాడీ కేంద్రాలు
- సబ్బపాడు, జంగాలపల్లిలో శిథిలావస్థకు భవనాలు
- కొత్తచంద్రగూడెంలో పదేళ్లుగా అద్దెభవనంలో నిర్వహణ
- ఐదేళ్ల పాలనలో కనీసం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- నిధులు కేటాయించి పునర్నిర్మించాలని వేడుకోలు



కొత్తచంద్రగూడెంలో అద్దెభవనంలో అంగన్వాడీ కేంద్రం





సబ్బపాడు, జంగాలపల్లిలో పెచ్చులూడిన భవనాల శ్లాబు

విద్యకు పెద్దపీట వేస్తాం.. నాడు-నేడు కింద పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల రూపురేఖలు మారుస్తామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పినా.. ఐదేళ్ల పాలనాకాలంలో అంగన్వాడీల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా పలుచోట్ల కేంద్రాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుండగా.. కొన్నిచోట్ల సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఉన్న కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి. చిన్నారులు, బాలింతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

(మైలవరంరూరల్, ఆంధ్రజ్యోతి)

మైలవరం మండలంలోని చంద్రగూడెం శివారు సబ్బపాడులో అంగన్వాడీ కేంద్రాన్ని రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. భవనం శ్లాబు పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడి కిందపడుతుండటంతో పిల్లలు, గర్భిణులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. జంగాలపల్లిలోని అంగన్వాడీ భవనం శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. భవనం శ్లాబు పెచ్చులూడటంతోపాటు ప్రహరీ కుంగిపోయింది. వరండా, తరగది గది, వంట గదిలోని ఫ్లోరింగ్ పగుళ్లిచ్చింది. కొత్తం చంద్రగూడెంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పదేళ్లుగా అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. నాడు-నేడు కింద భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినప్పటికీ స్థలం లేకపోవడంతో అద్దెభవనంలోనే నడుపుతున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరడంతో గర్భిణులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో దెబ్బతిన్న భవనాల్లో కూర్చోవాలంటే ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లేనని భయపడుతున్నారు.

● దీర్ఘకాలంగా అసంపూర్తిగానే...

మైలవరం, పుల్లూరు సెక్టార్ల పరిధిలో 56 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 38 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, 8 కేంద్రాలను అద్దె భవనాల్లో, మరో 10 కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లోని గదులను తీసుకొని నడుపుతున్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అంగన్వాడీ భవనాల నిర్వహణకు నిధులు అంతంతమాత్రంగా కేటాయించడంతో చాలా భవనాలు శిథిలమయ్యాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు ప్రారంభించినా బిల్లులు రాక పనులను సగంలోనే నిలిపివేశారు. పొందుగలలో భవన నిర్మాణం పూర్తి కావచ్చినా.. పనులను నెలల తరబడి చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలోని ఒకే గదిలో పిల్లలకు వంట, తరగతులను చెప్పాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాలకు, శిథిలావస్థకు చేరిన భవనాలకు నిధులు కేటాయించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్వాడీ కేంద్రాల సమస్యలపై సీడీపీవో పుష్పలత ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా దెబ్బతిన్న భవనాలకు నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించామని, నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తామన్నారు. అదేవిధంగా భవనాలు లేని కేంద్రాలకు గ్రామాల్లో స్థలాలను చూసి సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

సమస్యలు పరిష్కరించండి

- మంత్రి సంధ్యారాణికి అంగన్వాడీ సంఘ నేతల వినతి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న సంఘ నేతలు

పెనమలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి తెలుగునాడు అంగన్వాడీ ట్రేడ్‌యూనియన్ నాయకులు సచివాలయంలోని మంత్రి పేషీలో వినతి పత్రం ఇచ్చారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలుచేయాలని, సెంటరు నిర్వహణకు ఇబ్బందిగా ఉన్న నాలుగు యాప్‌లను ఒకే యాప్ కిందికి తీసుకురావాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, కూరగాయలు, సరుకుల బిల్లుల ధరలు పెంచాలని తదితర ఇరవై అంశాలతో వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసమ్మ తదితరులు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 565

వీఆర్ సిద్ధార్థ విద్యార్థినికి అమెజాన్‌లో 52.6 లక్షల ప్యాకేజీ

పెనమలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల (డీమ్డ్ టూబీ యూనివర్సిటీ) విద్యార్థిని నిహితా వేములపల్లి 52.6 లక్షల వార్షిక ప్యాకేజీతో అమెజాన్ కంపెనీలో ఉద్యోగం సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. టెక్నాలజీ, ఆవిష్కరణలపై ఆసక్తి ఉన్న నిహిత అమెజాన్ కంపెనీలో సొల్యూషన్ ఆర్కిటెక్టుగా కీలక బాధ్యతలు నిర్వహించనుంది. రికార్డు ప్యాకేజీని సాధించిన నిహితను కళాశాల యాజమాన్యం అభినందించింది. అభినందన కార్యక్రమంలో వీసీ డాక్టర్ పీవీరావు, సెక్రటరీ పీ లక్ష్మణరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం రాజయ్య, ప్రో వీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డీన్ డాక్టర్ రాజేశ్వరరావు, కే శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చెత్తగా నిర్వహణ!

- బాపులపాడు గ్రామ పంచాయతీలో అధ్వానంగా పారిశుధ్యం
- పర్మినెంట్ డంపింగ్ యార్డ్ లేక ఇబ్బంది
- సకాలంలో వేతనాలు అందక విధులకు డుమ్మాకొడుతున్న పారిశుధ్య కార్మికులు
- మూడు నెలలకొకసారి వేతనాలు
- సమస్యపై దృష్టి సారించని అధికారులు.. ప్రజాప్రతినిధులు
- ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు



బాపులపాడు శ్మశాన వాటిక వద్ద చెత్త.. ఇన్‌సెట్‌లో డంపింగ్ యార్డులో కొండలా పేరుకుపోయిన చెత్త..

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

బాపులపాడులో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారుతోంది. వీధుల వెంబడి ప్రజలు వేస్తున్న వ్యర్థ పదార్థాలను సకాలంలో పంచాయతీ సిబ్బంది తొలగించకపోవడంతో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. గ్రామంలో ప్రతీ రోజు దాదాపు ఐదు టన్నుల చెత్త పోగుబడుతోంది. పంచాయతీ కాంట్రాక్టు సిబ్బంది 60 మందిలో పారిశుధ్య నిర్వహణకు 42 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులోనే శానిటరీ మేస్త్రీ(విశ్రాంతి ఉద్యోగి) కూడా ఉన్నారు. ఈ 41 మంది కార్మికులంతా



స్టేట్‌బ్యాంక్ సందులో చెత్తకుండీ చుట్టూ పడి ఉన్న చెత్త

బ్యాచ్‌లు వారీగా విడిపోయి గ్రామంలోని పలు వీధుల్లో చెత్తను సేకరించి ట్రాక్టర్లులో డంపింగ్ యార్డ్‌కు తరలిస్తుంటారు. గ్రామ పంచాయతీకి చెత్త నిర్వహణ పెనుభారంగా మారింది. గ్రామం పెద్దది కావడంతో పాటు రైతుబజార్లు, జంక్షన్‌లోని మూడు రోడ్లు గ్రామం పరిధిలో ఉన్నాయి. కిరాణా, వివిధ రకాల వ్యాపార సంస్థలు, దుకాణాలు, చేపలు, మాంసం దుకాణాలతో ప్రతి రోజు ఐదు టన్నుల చెత్త పోగుపడుతోంది. ప్రతి రోజు సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. కార్మికులు తక్కువ మంది వచ్చిన రోజు కొన్ని ఏరియాలను వదిలి ముఖ్యమైన వీధుల్లో చెత్తను సేకరించి డ్రైనేజీలను శుభ్రం చేస్తున్నారు. కొన్ని ఏరియాల్లో వారానికి ఒకసారి మాత్రమే శుభ్రం చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో చెత్త పేరుకు పోయి దుర్గంధం వెదజల్లే పరిస్థితి ఎదురవుతోంది. విజయవాడ, నూజివీడు రోడ్డుల్లో దుకాణాలు వెంబడి ఉన్న ప్రధాన డ్రైనేజీలు ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడిపోవడం తో కొద్దిపాటి వర్షం వచ్చినా మురుగు నీరు రోడ్డు మీదకు వచ్చి దుకాణాల యజమానులకు ఇబ్బందిగా మారుతోంది.

మూడు నెలలకు వేతనాలు

గ్రామంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలలకు ఒకసారి వేతనాలు అందిస్తున్న పరిస్థితి నెలకొంది. పంచాయతీకి ఆదాయ వనరుగా ఉన్న గృహ, నీటి కుళాయి పన్నులు సకాలంలో వసూళ్లు కాకపోవడంతో పంచాయతీ నిర్వహణ భారంగా మారుతోంది. కాంట్రాక్టు కార్మికులకు చెల్లిం చాల్సిన వేతనాలు మూడు నెలలకొకసారి చెల్లిస్తున్నా రు. రెండు రోజుల కిందట ఆగస్టు నెల వేతనాలు ఇచ్చారు. సకాలంలో వేతనాలు రాకపోవడంతో కొంత మంది కార్మికులు ప్రతీరోజు గైర్హాజరు అవుతున్నారు.

కొండలా పేరుకుపోయిన చెత్త

2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చెత్తనుంచి సంపద సృష్టించే ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కూడా పైసా సంపాదన సృష్టించకపోగా ప్రాజెక్టు వృథాగా పడి ఉంది. అందులో ఇంత వరకు చెత్తనుంచి సంపద సృష్టించే కార్యక్రమం నిర్వహించకపోవడంతో చెత్త కొండలా పేరుకుపోవడంతో డంపింగ్ యార్డ్ నిర్వహణ కూడా పంచాయతీకి భారంగా మారింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పారిశుధ్య సమస్యపై దృష్టి సారించి, ప్రణాళికాబద్ధంగా చెత్త, వ్యర్థాల తొలగింపునకు శ్రీకారం చుట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రోడ్ల అభివృద్ధి

బీబీగూడెం మాజీ సర్పంచ్ బోయపాటి బసవపూర్ణయ్య



బీబీగూడెంలో డ్రెయినేజీ పనులు ప్రారంభించిన టీడీపీ నాయకులు

గన్నవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ సర్పంచ్ బోయపాటి బసవపూర్ణయ్య (నల్లబాబు) అన్నారు. మండలంలోని బీబీగూడెం నుంచి తోటపల్లి వరకూ రూ.25 కోట్లతో నిర్మించే ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బసవపూర్ణయ్య మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా దూసుకుపోతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి కావాల్సిన రోడ్డు నిలిచిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ పనులు ప్రారంభమయ్యాయన్నారు. కాంట్రాక్టర్ యలమంచిలి వెంకటరత్నం నాణ్యత ప్రమాణాలతో పనులు చేస్తున్నారని తెలిపారు. ఎన్నోఏళ్లుగా గన్నవరం- ఆగిరిపల్లి మధ్య ప్రయాణించే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బోయపాటి మురళీకృష్ణ (బుల్లియ్య), తొమ్మండ్రు రవీంద్ర, అయ్యంకి సీమోను, కొవ్వలి కోటేశ్వరరావు, ఏతః శ్రీహరి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి గడియారం అందజేత



గడియారం అందజేస్తున్న శాంతకుమార్

గన్నవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయానికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, పాఠకుడు చిన్నాబత్తిన శాంతకుమార్ గోడ గడియారాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రభుత్వంతో పాటు పాఠకులు, దాతలుతోనే గ్రంథాలయాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రంథాలయం ఇన్‌చార్జి పి.దుర్గాలక్ష్మి, శంకర్, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



కుందేరులో పశు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నరసింహులు

కుందేరులో పశువైద్య శిబిరానికి విశేషస్పందన

కంకిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి అను సందానంగా రైతులు పశుపోషణపై దృష్టి పెట్టాలని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ నరసింహులు అన్నారు. మండలంలోని కుందేరులో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ, రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణపై దృష్టి పెట్టాలన్నారు. శ్రీనివాస హేచరీస్ ఎండీ డాక్టర్ సోమిరెడ్డి, కె. శ్రీనివాసరావు, ఉప సంచాలకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రేమల్లె హైస్కూల్‌కు భోజనపాత్రలను అందజేస్తున్న యనమదల భీమశంకరరావు

దాతల సహకారంతో రేమల్లె హైస్కూల్ అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్యజ్యోతి) : దాతల సహకారంతోనే విద్యార్థులకు మౌలికసదుపాయాల కల్పనతో పాటు పాఠశాల అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం లూథర్‌పాల్ సూచించారు. రేమల్లె హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట సామాగ్రిని దాత యనమదల భీమశంకరరావు బుధవారం అందజేశారు. వడ్లమూడి వెంకటకృష్ణారావు, కొల్లూరు చంద్రకాంత్, కలపాల రాధాకృష్ణ, దారపురెడ్డి భాస్కరరావు, వెలమర్తి రవి బాబు, సువర్చలా దేవి పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం 20న

గన్నవరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో ఈ నెల 20న జరగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయా లని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు మందా వేణుబాబు అన్నారు. బుధవారం స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆత్మీయం సమ్మేళనం కరపత్రాలను ఆవిష్క రించారు. దేవరపల్లి విక్టర్‌బాబు, ధనియాల నాగరాజు దేవరపల్లి ఏసుబాబు, వినోద్, కోటేశ్వరావు, అబుజ్జి, రాజు, దుర్గారావు, పాపారావు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అపార్టుమెంట్ పైనుంచి పడి యువకుడి మృతి

పెనమలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అపార్టుమెంట్ పై ఫ్లోరు నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక యువకుడు మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కానూరు కామయ్యతోపు వద్ద నివాసముండే గొట్టిపాటి శశాంక్ (36) పెనమలూరు పోలీసుస్టేషను ఎదురుగా చెరుకురసం బండి నడుపుతాడు. మంగళవారం రాత్రి పది గంటలకు అతను నివాసముండే అపార్టుమెంటుపై ఫ్లోర్ నుంచి ప్రమాదవశాత్తూ జారిపడిపోయాడు. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్క డ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్మశానవాటికల స్థలాల సమస్యలు పరిష్కరించాలి



దళితవాడల స్థలాల సమస్యలను తహసీల్దార్ జె.విమలకుమారికి వివరిస్తున్న రాజు

ఉంగుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వివిధ గ్రామాల్లో అపరిష్కృతంగా వున్న దళితవాడల భూములు, శ్మశానవాటికల స్థలాల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు తహసీల్దార్ జాలాది విమల కుమారికి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ విమలకుమారిని మర్యాదపూర్వకంగా కలిసిన మాలమహానాడు నాయకులు దళితుల భూ సమస్యలను ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంథోని, మండల అధ్యక్షుడు రాపల్లి విల్సన్, నాయకులు సిరివెళ్ల చిట్టిబాబు, తుమ్మలపల్లి రాజు, అమర్తల జీవన్, కాశీ నాగార్జున, ధరణికోట సూర్యప్రకాష్, పెనుమాక రాజేష్, పూసల వినయ్ పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కంకిపాడు విద్యార్థినులు

రాష్ట్రస్థాయి పోటీలకు కంకిపాడు విద్యార్థులు

కంకిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని కంకిపాడు జెడ్పీ పాఠ శాల హెచ్‌ఎం జి. సుధారాణి అన్నారు. స్థానిక విలేకరులతో హెచ్‌ఎం మాట్లాడుతూ, స్కూల్ గేమ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన 68వ జిల్లా సెలక్షన్లలో అండర్ 17 విభాగంలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు శీలం కీర్తి, దండుగుల నర్సమ్మ, అండర్ 14 సాఫ్ట్‌బాల్ బాలల విభాగంలో చేబ్రోలు, సీతాల సాయి వర్షిత నాయుడు, అండర్ 14 బాలికల బేస్ బాల విభాగంలో మట్టా కీర్తి, యార్లగడ్డ భవిసారికలు ఎంపిక అయ్యారని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు మత్తి హరిగోపాల్, లకనం దుర్గాప్రసాద్‌లను ఎంఈవో ప్రసాద్‌తో పాటు హెచ్‌ఎం అభినందించారు.

ఉయ్యూరు విద్యార్థులు..



ఉయ్యూరు : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో అండర్ -14 బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలో వై.రాహుల్, అండర్ -14 బేస్‌బాల్ పోటీలో జి.జీవన్‌కుమార్ విశేష ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కె.జోత్స్న దేవి తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పోటీలకు ఎంపికైన విద్యార్థులు, వీరికి శిక్షణ నిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి



తహసీల్దార్ నాగభూషణానికి దరఖాస్తు అందజేస్తున్న చిరుమామిళ్ల సూర్యం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం రానున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో తన ఓటు నమోదుకు ఫారం -18ని తహసీల్దార్ నాగ భూషణంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అట్లూరి శ్రీని వాసరావు, వడ్డి నాగేశ్వరరావు, గండేపూడి నితీష్‌కుమార్, మండాది రవీంద్ర, దయాల రాజీవ్‌కాంత్, వంపుగాని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

లైగింక వేధింపులపై తిరగబడదాం

● గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : మహిళలు, విద్యార్థులు లైగింక వేధింపులకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని, అటువంటి వారిని శిక్షించేందుకు కఠినమైన చట్టాలున్నాయని ఎస్సై ఎం. శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. వీరవల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం నిర్మల అధ్యక్షతన మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడుల నివారణకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహిం చారు. పాఠశాలల్లో, కళాశాలల్లో బాలికలు లైగింక వేధింపులకు గురైతే తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ లాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగితే తక్షణం చైల్డ్‌లైన్, హెల్ప్‌లైన్ నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల కృష్ణారావు, రమణగోపాల్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు



ప్రసాదంపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులు రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని నాల్గోవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు అన్నారు. బుధవారం విజయవాడ రూరల్ మండలం ఎనికే పాడు నుంచి నారాయణపురం రోడ్డులో రోడ్డును ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్న తోపుడు బండ్లను తొలగించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారులు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందన్నారు. దీని వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని హాకర్లకు ఆయన సూచించారు.

విత్తనాల స్వీయ సేకరణతో ప్రయోజనాలు

● రైతులకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఏడీఏ సీహెచ్ మంజుల

గుడివాడ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల్లోని విత్తనాలను సొంతంగా సేకరించుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఏడీఏ సీహెచ్ మంజుల సూచించారు. బుధవారం చిరిచింతలలో ఏడీఏ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌లో విత్తనశుద్ధి చేశాకే పొలాల్లో మినుము చల్లుకోవాలని ఆమె సూచించారు. రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు రోజూ పొలాల్లో తిరగటం వల్ల తెగుళ్ల ఆశిస్తే సస్యరక్షణకు అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు.



11 నుంచి భవానీ దీక్షల స్వీకరణ

● డిసెంబరు 21 నుంచి దీక్షల విరమణలు ప్రారంభం ● 25న ముగింపు, మహాపూర్ణాహుతి

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 11 నుంచి భవానీల దీక్ష స్వీకరణ ప్రారంభమవుతుందని ఈవో కేఎస్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీకశుద్ధ దశమి అనంతరం ఏకాదశి తిథిలో ఈనెల 11న ఉదయం 7 గంటలకు మండల దీక్ష స్వీకరణ ప్రారంభమవుతుంది. 15న సమాప్తి అవుతాయి. డిసెంబరు 1న అర్ధ మండల దీక్షల స్వీకరణ ప్రారంభమవుతుంది. 5న ముగుస్తాయి. 14న సత్యనారాయణపురంలోని రామకోటి మైదానంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు కలశజ్యోతి ఉత్సవం ప్రారంభమవుతుంది. నగరోత్సవంలో పాల్గొన్న అమ్మవారు తిరిగి దేవస్థానానికి చేరతారు. డిసెంబరు 21 నుంచి 25 వరకు దీక్షల విరమణలు జరుగుతాయి. 21న ఉదయం 6.30 గంటలకు దీక్షల ముగింపు సందర్భంగా అగ్ని ప్రతిష్ఠాపన, శతచండీయాగం, గిరి ప్రదక్షిణలు, భవానీ దీక్షల విరమణలు జరుగుతాయి. డిసెంబరు 25న ఉదయం 10 గంటలకు దీక్షల విరమణలు సమాప్తి అవుతాయి. ఉదయం 10 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు. డిసెంబరు 21 నుంచి 26 వరకు దేవస్థానంలో ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఇవన్నీ అర్చకులు ఏకాంతంగా నిర్వహిస్తారు. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వర స్వామికి ప్రతిరోజూ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రలింగార్చన, ప్రతిరోజూ మధ్యాహ్నం 3నుంచి రాత్రి 7గంటల వరకు నిర్వహిస్తారు. రూ.500 రుసుము చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. కార్తీక సోమవారం ఏకాదశి, పౌర్ణమి, మాస శివరాత్రి రోజుల్లో బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకాలు జరుగుతాయి. రు.2000లు చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు.

నేడు ఎన్‌ఎంయూఏ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం

బస్టేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో పాటు విశిష్ట అతిథిగా ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు వీకేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్.పురుషోత్తం నాయుడు, పశ్చిమ కృష్ణా ఎన్జీవో నేత విద్యాసాగర్ పాల్గొంటారన్నారు. రాష్ట్రంలోని 128 డిపోల నుంచి యూనియన్ డిపో విభాగం అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజీల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారన్నారు.

నాకున్నది ఎకరం 94 సెంట్లే..!

● రికార్డుల్లో ఏడెకరాలున్నాయంటూ పెన్షన్ తొలగించారు
● బాధితుడు సనకా భాస్కరరావు ఆవేదన



మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం హయాంలో తమకు వృద్ధాప్య సామాజిక పెన్షన్ ఇచ్చేవారని, ఆ పింఛను రద్దు చేశారని చిలకలపూడికి చెందిన సనకా భాస్కరరావు వాపోయారు. బుధవారం ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన భాస్కరరావు తన సమస్యను ఆంధ్రజ్యోతికి వివరించారు. తనకు కేవలం ఎకరం 94 సెంట్ల పొలం ఉందని, అయితే రికార్డుల్లో ఏడెకరాలుగా చూపించారన్నారు. తనకున్న తెల్ల రేషన్‌కార్డు, పింఛను తొలగించారని భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. 5 నెలలుగా తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్యను పరిష్కారం కాలేదన్నారు.

బంగారు నానుతాడు చోరీ



జి.కొండూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు - గడ్డమణుగు రోడ్డులో చైన్ స్నాచింగ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లికి చెందిన వీరంకి వెంకాయమ్మ (60) అనే వృద్ధురాలు తన భావ వీరంకి శ్రీధర్, అన్న కుమార్తె బెజవాడ రేవతిలతో కలిసి టీవీఎస్ మోపెడ్‌పై వీరులపాడు మండలం అల్లూరు గ్రామంలో తన బంధువుల ఇంట్లో శుభ కార్యానికి వెళుతున్నారు. వీరు జి.కొండూరు - గడ్డమణుగు రోడ్డులో వెళుతుండగా వెనుక నుంచి మోటార్ బైక్‌పై హెల్మెట్ ధరించిన వ్యక్తి ఫాలో అయ్యాడు. అనంతరం వృద్ధురాలి మెడలో బంగారు నాను తాడు లాక్కొని పరారయ్యాడు. వృద్ధురాలి మెడలో చైన్ లాగడంతో ముగ్గురు కింద పడిపోయా రు. అయి తే వారికి ఎదురుగా మోటార్ బైక్ పై వచ్చే వారు ఎరుపురంగు పల్సర్ బైక్‌పై వచ్చిన వ్యక్తి ఈపని చేసినట్టు చెబుతున్నారు. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జి.కొండూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి టెన్నికాయి ట్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అండర్ 14 విభాగంలో పి.ఉషశ్రీ, టి.బంగారం, అండర్ - 17 విభాగంలో ఎం.దీపికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు జి.కొండూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్.ఎం రమేష్ బుధవారం తెలిపారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

గంపలగూడెం: పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఐ.కార్తిక్ అండర్ - 14లో రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్.ఎం కృష్ణఫర్ తెలిపారు. ఈనె 5న గూడూరులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈనెల 9, 10 తేదీల్లో ఏలూరు జిల్లా చింతలపూడిలో నిర్వహించనున్న పోటీల్లో కార్తిక్ పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని పీడీ అంజయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఆంజనేయులు అభినందించారు.

వాహనాల తనిఖీలు ముమ్మరం

జగ్గయ్యపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద జగ్గయ్యపేట సీఐ పీ.వెంకటేశ్వర్లు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. లైసెన్సు, హెల్మెట్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటోలను ఆపి, సురక్షిత ప్రయాణానికి పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవాలని పలు సూచనలు చేశారు. లైసెన్సులు, బ్యాడ్జిలు లేకుండా నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ట్రాఫిక్ ఏఎస్సై బేబి ఉన్నారు.

నూతన హైకోర్టు ఏజీపీకి సత్కారం

జగ్గయ్యపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో ఏజీపీగా నియమితులైన మండలంలో బూదవాడ గ్రామానికి చెందిన న్యాయవాది మూడావత్ రత్నాను బుధవారం జగ్గయ్యపేట జూనియర్ సివిల్ జడ్జిల ఏజీపీ టీఎల్ నరసింహారావు తన కార్యాలయంలో సత్కరించారు. న్యాయవాదులు శ్రీనివాసరావు, ఆంజనేయులులు పాల్గొన్నారు.

కమీషన్ తగ్గించడం బాధాకరం

జగ్గయ్యపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కమీషన్‌ను తగ్గించటాన్ని నిరసిస్తూ, పాలసీ దారుల ప్రీమియంపై జీఎస్టీ ఎత్తి వేయాలని కోరుతూ సోమవారం జగ్గయ్యపేటలో ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్లు ధర్నా చేశారు. ఎందరో నిరుద్యోగులకు ఉపాధి చూపుతున్న ఎల్ఐసీ ఏజెంట్ల కమీషన్ పెంచకపోగా, తగ్గించటం దారుణమని అన్నారు. ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేస్తే పాలసీదారులకు బారం తగ్గుతుందన్నారు. ఎల్ఐసీ తక్షణం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చ రించారు.

నూరుశాతం బీమా క్లెయిమ్‌ల
పరిష్కారంపై దృష్టిపెట్టండి

● ఇప్పటికే పూర్తయిన 98.20 శాతం క్లెయిమ్‌ల పరిష్కారం
● బాధితులకు చేయూతనివ్వడంలో బీమా సంస్థల కృషి భేష్
● ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంత ప్రజల వాహనాలు, వివిధ ఆస్తి నష్టాలకు సంబంధించి బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో బీమా సంస్థలు చూపిన చొరవ ప్రశంసనీయమని, ఇప్పటికే 98.20 శాతం క్లెయిమ్‌ల పరిష్కారం పూర్తయిందని, మిగిలిన కొద్దిపాటి క్లెయిమ్‌లను కూడా త్వరగా పరిష్కరించాలని బీమా సంస్థలకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో నిధి మీనా, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహంతో కలిసి బీమా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. బీమా సంస్థల వారీగా నమోదైన క్లెయిమ్‌లు, పరిష్కరించిన క్లెయిమ్‌లు, ఇంకా మిగిలి ఉన్న క్లెయిమ్‌లపై చర్చించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ 12,638 మోటారు వాహనాల క్లయిమ్‌లు, 2,821 ఆస్తుల క్లయిమ్‌లతో కలిపి మొత్తం 15,459 క్లయిమ్‌లు నమోదు కాగా 605 ఉపసంహరణ, 325 తిరస్కరణకు గురైన క్లెయిమ్‌లు పోనూ 14,529 నికర క్లయిమ్‌ల్లో ఆన్ అకౌంట్, అండర్ ఆక్షన్‌తో సహా 98.20 శాతం క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్ చేయడం జరిగిందన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంపై ముఖ్యమంత్రి తొలినుంచి ప్రత్యేకంగా దృష్టి సారించారని, ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలు లభ్యత తక్కువగా ఉండటం, అటాచ్‌మెంట్ రుణాలు, ఆర్సీ క్యాన్సిలేషన్ తదితరాల వల్ల కొన్ని క్లయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరగా పరిష్కరించి సెటిల్‌మెంట్ ప్రక్రియను పూర్తిచేయాలని నిధి మీనా సూచించారు. సమావేశంలో మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ ఆర్.ప్రవీణ్, జీఎం డీఐసీ బి.సాంబయ్య, వివిధ బీమా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

రేపు స్కిల్ స్పోక్స్ డ్రైవ్

కృష్ణలంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నవంబరు 8న శుక్రవారం స్కిల్ స్పోక్స్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు బుధవారం విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్కిల్ స్పోక్ డ్రైవ్‌లో ఉషా ఇంటర్నేషనల్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీ వారు పాల్గొంటున్నారన్నారు. ఈ కంపెనీలో ఉద్యోగాలకు టెన్త్ (పాస్/ఫెయిల్), ఐటీఐ (పాస్/ఫెయిల్) అప్రెంటీషిప్ పూర్తిచేసిన 20 నుంచి 35ఏళ్లలోపు వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు సుమారు రూ.12 వేల నుంచి రూ.15వేల వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగావకాశాలు ఉన్నాయని, నవంబరు 8న నిర్వహించబోయే ఈ స్కిల్ స్పోక్స్ డ్రైవ్‌కి హాజరైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఆయా ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్టు ఏపీఎస్ఎస్‌డీసీ సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తగిన అర్హతలు కలిగి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా హెచ్‌టీటీపీఎస్://టిన్యూరల్.కామ్/స్కిల్-స్పోక్స్-చీజేడీస్ట్ లింక్ నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి సదరు స్కిల్ స్పోక్స్ డ్రైవ్‌కి రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని, మరిన్ని వివరాలకు 6305004318 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

ఎన్టీటీపీఎస్ ఉద్యోగులపై నిఘా నేత్రం

● ఇకపై యూనిఫాం, సమయపాలన తప్పనిసరి చేస్తూ ఆదేశాలు

ఇబ్రహీంపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీటీపీఎస్‌లో నిర్లక్ష్యంగా విధులు నిర్వహించే ఉద్యోగులపై ఏపీ జెన్కో కఠిన చర్యలకు సిద్ధమైంది. ఉత్పత్తి నిలిచిపోవడానికి, తరచూ బ్రేక్‌డౌన్ అయ్యేందుకు కారణమైన సుమారు 100 మంది ఇంజనీరింగ్ విభాగంలో బదిలీ చేసిన జెన్కో యాజమాన్యం నూతనంగా యూనిఫాం, సమయ పాలనను తీసుకువచ్చింది. రెండ్రోజుల క్రితమే సీఈకి నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేసింది. విధులకు హాజరైనట్టు హాజరై బయటకు వెళ్లి సొంత పనులు చేసుకుంటున్నారని గుర్తించినట్టు స్పష్టంగా అందులో పేర్కొనడం గమనార్హం. ఇప్పటి వరకు జనరల్ డ్యూటీ చేసేవారు ఉదయమంతా సొంత పనులు చేసుకొని సాయంత్రం 3.30 వరకు విధులకు హాజరయ్యారు. ఇప్పటి వరకు వీరిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం, వడ్డీ వ్యాపారం ఇతరత్రా చేసేవారున్నారు. ఇప్పుడిచ్చిన ఆదేశాలతో ఉదయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు, మొదటి షిఫ్టు వారు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రెండో షిఫ్టు వారు మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8.30 వరకు, మూడో షిఫ్టు వారు రాత్రి 8.30 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు విధిగా యూనిఫాం ధరించి డ్యూటీ చేయాల్సి ఉంది. ఈ విధి విధానాలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలకు తీసుకోనున్నట్టు జెన్కో యాజమాన్యం పేర్కొంది. ఈ ఆదేశాలు నిర్లక్ష్యంగా ఉండే కొందరు ఉద్యోగులకు పచ్చి వెలక్కాయ నోట్లో పడ్డ చందంగా ఉంది.

రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

● అధికారుల అవగాహన సదస్సులో కలెక్టర్ బాలాజీ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. పల్లె పండుగ - ఉపాధి హామీ పథకం 2024-25 సిమెంటు రహదారులు - నాణ్యత అనే అంశంపై జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో బుధవారం పంచాయతీరాజ్, ఉపాధిహామీ పథకం సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గుంతలులేని రహదారులను తీర్చిదిద్దే లక్ష్యంతోపాటు, అన్ని రహదారులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గ్రామాల్లో ప్రస్తుతం చేస్తున్న రహదారుల నిర్మాణంలో నాణ్యత తగ్గకుండా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. రహదారుల నిర్మాణంలో ఉపయోగించే మెటీరియల్‌ను, నిర్మాణ పనులను అధికారులు తరచూ తనిఖీ చేయాలన్నారు. తొలుత ఏపీ ఆర్‌ఆర్‌పీ అడ్వయిజర్ కే ప్రభాకరరెడ్డి వివిధ కేటగిరీల్లో రహదారులు, సిమెంటు రహదారుల నిర్మాణంలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పంచాయతీ రాజ్ విభాగం ఎస్ఈ రమణారావు, ఈఈ సుధాకర్‌గౌడ్, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

10న డీఎస్సీ ఉచితశిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10న స్క్రీనింగ్‌టెస్ట్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. తన చాంబరులో బీసీ, ఎస్సీ, గిరిజన సంక్షేమశాఖ, రవాణా, వైద్యశాఖ అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గంగూరులోని ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల, కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలల్లో 10న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్ష నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. కంప్యూటర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే సరిచేసేందుకు సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు రవాణా సౌకర్యాలను కల్పించాలన్నారు. అభ్యర్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమశాఖ జేడీ షాహిద్‌బాబు, డీఎంహెచ్‌వో గీతాభాయి, మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజరు పెద్దిరాజు పాల్గొన్నారు.

సెమీస్ దశకు ఏపీ స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలు



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పటమట చెన్నుపాటి రామకోటయ్య స్టేడియం వేదికగా జరుగుతున్న కాసా వడ్లమూడి మోహన్‌కృష్ణ మెమోరియల్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ అండర్-13 బాలబాలికల బ్యాడింటన్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండోరోజు బాలబాలికల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పలు జిల్లాల ప్లేయర్ సెమీస్ దశకు చేరుకున్నారు. పోటీలను కేడీబీఏ అధ్యక్షులు అంకమ్మ చౌదరి, ఉపాధ్యక్షులు హరికృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

రెండోరోజు ఫలితాలు ఇలా..

బాలుర అండర్-13 క్వార్టర్స్ ఫైనల్స్‌లో ఎం జశ్వంత్, కే మోక్షజ్ఞ సాయి, సాయి సోహన్, బాలికల సింగిల్స్‌లో డీ ఆశాశ్రీ, ఎం భవిత, శ్రీరామ్ కావ్య, ఎస్ మనస్వి ప్రత్యర్థులపై విజయం సాధించి సెమీస్‌కు చేరారు. బాలురు డబుల్స్‌లో జీ షణ్ముక్ వర్ధన్-ఎం జశ్వంత్, కే. మోక్షజ్ఞ సాయి- కండెపి సుహాస్, సీహెచ్ మహీధర్‌రెడ్డి - టీ వర్షిత్, దుర్గా అఖిలేష్ - సాయి సోహన్ సెమీస్‌లోకి ప్రవేశించారు. బాలికల డబుల్స్‌లో జీ వెంకట లతారెడ్డి-శ్రీరామ్ కావ్య, ఎం శ్రీ తేజ - ఎం వీర దుర్గాలక్ష్మి, సీహెచ్ ఉజ్వల సుముఖి-వై చిన్మయి, డీ ఆశా శ్రీ-ఎస్ మనస్వి విజయం సాధించి సెమీస్‌కు చేరారు.

సీఎం సహాయనిధికి రూ.50లక్షల విరాళం..



అన్న క్యాంటీన్లకు జీబీఆర్ హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ గద్దం బుచ్చారావు రూ.50లక్షల విరాళాన్ని అందించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి ఈ మేరకు చెక్కు అందజేశారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం తీసుకున్న సంకల్పానికి మద్దతుగా విరాళం అందించిన బుచ్చారావును సీఎం చంద్రబాబు అభినందించారు.



దుర్గగుడిలో హుండీలు లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది.

దుర్గమ్మకు కానుకల రూపేణ రూ.2.83 కోట్లు

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 15 రోజులకు గాను రూ.2,83,53,460 నగదు రూపేణా లభించాయి. బంగారం 431గ్రాములు, వెండి 6కిలోల 450 గ్రాములు కానుకల రూపేణ వచ్చాయి. 324 యూఎస్ఏ డాలర్లు, 25 యుఏఈ దీర్హమ్స్, ఇండోనేషియా కరెన్సీ రూ.30వేలు, 10 యూరప్ యూరోలు, 1 ఒమన్ రియాల్, 412 భైంసాలు, 260 కెనడా డాలర్లు, 6 సౌదీ రియాల్స్, 30 ఇంగ్లండ్ డాలర్లు, 25 ఆస్ట్రేలియా డాలర్లు, 144 ఖతార్ రియాల్స్ లభించాయి. ఆన్‌లైన్ హుండీ ద్వారా రూ.89,633 వచ్చాయి. డిప్యూటీ ఈవో రత్నరాజు, అధికారులు, దేవదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విల్లుపురం - సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చత్ పూజ, కార్తీక ఏకాదశి పండుగ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే విల్లుపురం, సికింద్రాబాద్ మధ్య రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. 07601 సికింద్రాబాద్ - విజయవాడ రైలు గురువారం రాత్రి 7.40 గంటలకు బయలు దేరుతుంది. గురువారం మధ్యాహ్నం 1.05 గంటలకు గమ్యం చేరుతుంది. 7, 14 తేదీల్లో ఈ రైలు నడుస్తుంది. 07602 విల్లుపురం - సికింద్రాబాద్ రైలు శుక్రవారం సాయంత్రం 4.05 గంటలకు బయలుదేరుతుంది. శనివారం ఉదయం 9.40 గంటలకు గమ్యం చేరుతుంది. 8, 15 తేదీల్లో ఈ రైలు నడుస్తుంది. ఈ ప్రత్యేక రైళ్లు మౌలాలి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, తిరువనంతపురం స్టేషన్లలో ఆగుతుంది. ఫస్ట్ ఏసీ, ఏసీ టూటైర్, ఏసీ త్రీ టైర్, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఈ రైళ్లకు అమర్చబడి ఉంటాయి.



యూనిడో ప్రతినిధులతో భేటీ అయిన మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

కాలుష్యరహిత నగరంగా విజయవాడ

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతున్న క్రమంలో ఇందుకు సహకరిస్తున్న యూనిడో ప్రతినిధులతో బుధవారం విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. వాడుక నీటి శుద్ధతపై వీఎంసీ తీసుకుంటున్న చర్యలను, యూనిడో నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఈ వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ టెక్నికల్ అడ్వయిజర్ డాక్టర్ ఎన్.పి.సింగ్, కో-ఆర్డినేటర్ దీపిక పాల్గొన్నారు.

క్రీడా పాలసీలో సీఎం చంద్రబాబు మార్కు

● ఏపీవోఏ అధ్యక్షుడు ఆర్‌కే పురుషోత్తం హర్షం

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ, శ్రద్ధతో అద్భుతమైన నూతన క్రీడాపాలసీ తీసుకురావడం అందరికీ ఆనందదాయకమని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే పురుషోత్తం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. క్రీడా వసతుల కల్పన, క్యాష్ అవార్డులు, క్రీడా కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచడం వంటి నిర్ణయాలు దేశంలోనే అత్యున్నత క్రీడా పాలసీకి నిలుస్తుందనడంలో సందేహం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రలో గచ్చిబౌలి స్టేడియంలో వసతులు, నేషనల్ గేమ్స్ నిర్వహణ, ఆఫ్రో ఏషియన్ గేమ్స్ హైదరాబాద్‌లో నిర్వహించడంతో ఆయన గతంలోనే విజన్ చాటారన్నారు. సీఎం చంద్రబాబుతో ఏపీవోఏ అడుగులు వేస్తుందని, నేషనల్ గేమ్స్ నిర్వహణకు సహకారం అందిస్తామని పురుషోత్తమ్ తెలిపారు.



గాంధీనక్షత్రశాల (ప్లానిటోరియం)ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

గాంధీహిల్‌ను అభివృద్ధి చేస్తాం

● ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గాంధీ హిల్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. గాంధీ హిల్‌పై నక్షత్ర ప్రదర్శన శాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల క్రితం ప్లానిటోరియం మూతపడిందని రూ.82 లక్షలతో ఆధునీకరించిన ప్లానిటోరియంను తాను ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. అంతరిక్షం, గ్రహ కదలికలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించటంతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లోని అనేక అంశాలను ప్లానిటోరియం అందిస్తుందన్నారు. వీఎంసీ అధికారులతో సంప్రదించి త్వరలోనే గాంధీకొండ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటానికి కృషి జరుగుతుందన్నారు. జోనల్ కమిషనర్ రమ్యకీర్తన, సీఎంహెచ్‌వో సురేష్ బాబు, ఈఈ వెంకటేశ్వరరెడ్డి, సాంకేతిక సలహాదారు నారాయణ మూర్తి, కూటమి నేతలు అడ్డూరి శ్రీరామ్, బుల్లా విజయ్, హర్ష పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.565

చెత్త సేకరణలో అలసత్వం వహిస్తే చర్యలు

గుడివాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ విషయంలో మున్సిపల్ సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. పట్టణంలోని పలు హోటళ్లలో పరిశుభ్రత ప్రమాణాలను పరిశీ లించి పలు సూచనలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ముక్కు మూసుకోవాల్సిందే!

- గుడివాడలో పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో బహిరంగ మూత్ర విసర్జన
- దుర్గంధం వెదజల్లుతున్న రోడ్లు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

గుడివాడ మున్సిపాలిటీ పరిధిలో మెయిన్ రోడ్డులోను, పట్టణవ్యాప్తంగా ఏ సందులోకి వెళ్లినా దుర్గంధం వెదజల్లుతోంది. ఉన్న పబ్లిక్ టాయిలెట్లను, మున్సిపల్ దుకాణ సముదాయంలో ఉన్న టాయిలెట్‌ను పగుల కొట్టి అద్దెకిచ్చేశారు. పట్టణంలో ఐదు చోట్ల యూజ్ అండ్ పే టాయిలెట్లను ఏర్పాటు చేసి వాటిని అద్దె ప్రాతిపదికన ఏజెన్సీలకు కట్టబెట్టారు. మూత్ర విసర్జనకూ రూ.5 చెల్లించాల్సి రావడంతో రోడ్లవెంబడి, ఖాళీ స్థలాల్లో ప్రజలు మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ కంపుకొడుతున్నాయి. మున్సిపల్ దుకాణాలు, ప్రైవేటు దుకాణ సముదాయాల్లోనూ ఎక్కడా టాయిలెట్లు ఏర్పాటు చేయలేదు. దుకాణ యజమానులు, అందులో పనిచేసేవారు, పాఠశాల, కళాశాల విద్యార్థులు బహిరంగ మూత్రవిసర్జన చేస్తున్నారు.

ప్రధాన ప్రాంతాలివే..

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం మొదలుకుని చింతలకాలువ వెంబడి బహిరంగంగానే మూత్ర విసర్జనకు పాల్పడుతున్నారు. ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లే దారి, కోర్టు పక్క సందు, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, ఆఫీసర్స్ క్లబ్ పక్క సందు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీ గది పక్క రోడ్డు, రైల్వేస్టేషన్ ప్రాంగణం, జిల్లా పరిషత్ అతిథి గృహం వెనుక, పోలీస్ క్వార్టర్స్ రహదారి, పార్కు స్కూల్ వద్ద, కోళ్లదొడ్డి సమీపంలో, నలంద మున్సిపల్ పాఠశాల, ఏజీకే మున్సిపల్ పాఠశాల వద్ద, ఏకేటీపీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల వద్ద, చెత్త డంప్‌ల పక్కన ఎక్కడపడితే అక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది బ్లీచింగ్ కూడా చల్లడం లేదు.




ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లే దారిలో మూత్రవిసర్జన చేస్తున్న ప్రాంతం.. చెత్త డంప్ పక్కనే..

ఉన్న వాటిని కూలగొట్టారు

గతంలో ఎస్పీఎస్ మున్సిపల్ దుకాణ సముదాయం పక్కన పబ్లిక్ టాయిలెట్లు ఉండేవి. కొత్త మున్సిపల్ కార్యాలయ నిర్మాణం అనంతరం రాకపోకలకు ఇబ్బందిగా ఉందనే నెపంతో మున్సిపాలిటీ వాటిని కూలగొట్టేశారు. ప్రత్యామ్నాయంగా ఎక్కడా టాయిలెట్లను నిర్మించలేదు. ఇదే దుకాణ సముదాయంలో పై అంతస్థులో ఉన్న టాయిలెట్‌ను పూర్తిగా తొలగించి వేరే వారికి వ్యాపారం నిమిత్తం అద్దెకిచ్చేశారు. పట్టణంలోని రద్దీ ప్రాంతాలైన బస్టాండ్, మార్కెట్, రైతుబజార్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, గౌరీశంకర్ సెంటర్లలో రహదారి వెంబడి మున్సిపల్ స్థలాల్లో యూజ్ అండ్ పే టాయిలెట్లను ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టేశారు. మూత్ర విసర్జనకు రూ.5 వసూలు చేస్తుండటంతో ప్రజలు రహదారుల వెంబడి మూత్ర విసర్జన చేయడం ప్రారంభించారు. మార్కెట్ సెంటర్, రైతు బజార్ వద్ద టాయిలెట్లు ఉన్నా అవి లోపలికి ఉండడంతో వినియోగించుకోవడం లేదు.

మరిన్ని టాయిలెట్లు ఏర్పాటు చేస్తాం

బహిరంగ మూత్ర విసర్జన వలన దుర్గంధం వ్యాపిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు అందాయి. త్వరలో పట్టణవ్యాప్తంగా సర్వే నిర్వహించి ఎక్కడెక్కడ బయో టాయిలెట్ల అవసరముందో గుర్తించి ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం వినియోగంలో ఉన్న యూజ్ అండ్ పే టాయిలెట్లలో మూత్ర విసర్జనకు రుసుం వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ప్రతి టాయిలెట్ వద్ద మూత్ర విసర్జన ఉచిత మని బోర్డులు పెట్టమని ఆదేశిస్తున్నా.

- శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలి

పట్టణానికి రోజూ వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యావసర విక్రయ దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, బస్టాప్‌ల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు వందలాది మంది వేచి ఉంటారు. వారిలో చాలామంది రహదారుల పక్కన మూత్రవిసర్జన చేస్తున్నారు. దీంతో మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు.


డోకిపర్రులో నిరసన తెలుపుతున్న మహిళలు

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం వద్దు

గుడ్లవల్లేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రు జగనన్న కాలనీలో మద్యంషాపు ఏర్పాటు చేయొద్దంటూ సీపీఎం నాయకుడు బీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలు బుధవారం నిరసన తెలిపారు. గుడ్లవల్లేరులో వార్పు రోడ్డు దాటాక రెండు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, వాటితో తమకు ఇబ్బంది కలుగుతుందని ఆ దుకాణాలకు 500 మీటర్ల దూరంలో ఉన్న నీల కంఠేశ్వరపురానికి చెందిన కొందరు మహిళలు..ఓరా పాపారావు, పిడుగు దేవసహాయం, చంద్రం ఆధ్వర్యంలో తహసీల్దారు లోకరాజుకు వినతిపత్రం అందించారు. ఆ రోడ్డులో తమ ఆడపిల్లలు బడులకు వెళ్లాలని, మద్యం దుకాణాలతో ఇబ్బంది పడతారంటూ అందులో పేర్కొన్నారు.


అర్జీ అందజేస్తున్న రైతులు

భూ సమస్యలు పరిష్కరించండి

- తహసీల్దార్ రంగారావుకు యలమర్రు రైతుల వినతి

పెదపారుపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ రంగారావును యలమర్రు రైతులు కోరారు. యలమర్రులో బుధవారం గ్రామసభ నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను, పొరపాట్లను సరిదిద్ది ప్రజలకు న్యాయం చేయడం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. పొలాల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని, రికార్డుల్లో పేర్లు తప్పుగా నమోదయ్యాయని, వాటిని సరిచేయాలని, అడంగల్‌లో విస్తరణలో తేడాలు, తక్కువ భూమి నమోదు కావటం, ఇతర సమస్యలు ఉన్నాయని అధికారుల దృష్టికి తెచ్చారు. సమస్యలపై రైతులు అర్జీలు అందజేశారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుందరం, పంచాయతీ కార్యదర్శి డీసీహెచ్ శ్రీనివాసరావు, వీఆర్వో, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, నవంబరు 6(ఆంధ్ర జ్యోతి): ప్రజలకు అధికారులు జవాబు దారీగా ఉండాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. సమస్యల పరి ష్కారంలో ఇబ్బం దులుంటే ఫోన్‌లో గానీ, నేరుగా గానీ తన దృష్టికి తీసుకురావాలని సూ చించారు. త్వరలోనే గ్రామీణ తాగునీటి పథకం ద్వారా నియోజకవర్గ ప్రజలకు సురక్షిత నీటిని అందిస్తామ న్నారు. అధికారులకు సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. గ్రామాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల గ్రామాల్లో ప్రజలకు అవ గాహన కల్పించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టి తెచ్చారు. కుమార్‌రాజాను ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీడీవో కాంద్రు జ్యోతి పుష్పగుచ్ఛం అందించి సభకు స్వాగతించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు

కూచిపూడి : 'అయ్యంకి నుంచి మొవ్వ కోర్టు వరకు ఆర్ అండ్ బీ రహదారిలో గుంతలు పూడ్చటానికి రూ.కోటి మంజూరయ్యాయి. గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.4.25 కోట్లు మంజూరయ్యాయి. పామర్రు నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ రహదారుల అభివృద్ధికి రూ.40 కోట్లు మంజూరు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు ప్రతిపా దనలు అందించాం.' అని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. మొవ్వ మండల పరిషత్ సర్వసభ్య సమా వేశం ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాల్లో సీసీ రహదారులు మొదలుపెట్టని కాంట్రా క్టర్లకు 48 గంటలు సమయం ఇచ్చి పనులు ప్రారంభిం చకపోతే వేరొకరి అవకాశం కల్పిం చాల్సిందిగా పంచా యతీరాజ్ ఏఈకి ఎమ్మెల్యే సూచించారు. ఎంపీడీవో విమాదేవి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధ రాజు, జడ్పీటీసీ రాజులపాటి పార్వతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా


చిరిచింతలలో పొలంబడి నిర్వహిస్తున్న ఏడీఏ సీహెచ్ మంజుల

విత్తనాల స్వీయ సేకరణతో ప్రయోజనాలు

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఏడీఏ సీహెచ్ మంజుల

గుడివాడ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాల్లోని విత్తనాలను సొంతంగా సేకరించుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఏడీఏ సీహెచ్ మంజుల సూచించారు. బుధవారం చిరిచింతలలో ఏడీఏ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌లో విత్తనశుద్ధి చేశాకే పొలాల్లో మినుము చల్లుకోవాలని ఆమె సూచించారు. రైతులకు వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు రోజూ పొలాల్లో తిరగటం వల్ల ఎలుకల నివారణకు, ఏదైనా తెగుళ్లు ఆశిస్తే సస్యరక్షణకు అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ఏడీఏ ఎస్.రమాదేవి, మండల వ్యవసాయ శాఖ అధికారి బోలెం అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల అండతో మార్కెట్‌యార్డు రోడ్డులో నిర్మించిన అక్రమ షాపులను మునిసిపల్ అధికారులు తొలగించారు. మూడు స్తం భాల సెంటర్ నుంచి చల్లపల్లికి వెళ్లే రోడ్డులోని ఆక్రమణలను, హౌసింగ్‌బోర్డు కాలనీలో రోడ్ల పక్కన అడ్డదిడ్డంగా నిర్మించిన షాపు లను కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో తొలగించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు సచివాలయ అధికారులు పాల్గొన్నారు. నగరంలో మునిసిపల్, రెవెన్యూ స్థలాలు, రోడ్ల మార్జిన్లను ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపటి నుంచి సీపీఎం ప్రజాపోరు

చల్లపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వైనరసింహారావు తెలిపారు. గుంటూరు బాపనయ్య భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.


భీమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మొవ్వ శివాలయంలో కార్తీక వనసమారాధన

కూచిపూడి, నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి): మొవ్వ వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి దేవాలయం లో కార్తీక దామోదరునికి ప్రత్యేక పూజలు చేశారు. 1000 మందికిపైగా అన్నసమారాధన నిర్వహించారు.


పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు

'ఏ షార్ట్ గైడ్ టు క్లినికల్ ఫార్మకోకైనటిక్స్' పుస్తకావిష్కరణ

గుడ్లవల్లేరు, నవంబరు 6(ఆంధ్ర జ్యోతి) : వీవీఐపీఎస్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ఫార్మకాగ్నసీ విభాగ హెచ్‌వోడీ డాక్టర్ పి.రవీష రచించిన ఏ షార్ట్ గైడ్ టు క్లినికల్ ఫార్మకోకైనటిక్స్ పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఔషధం మానవ శరీరం లోపలికి ప్రవేశించాక ఏవిధం గా పనిచేస్తుంది, రోగి వయస్సు ప్రకారం ఔషధ మోతాదును ఎలా నిర్ణయించాలనే అంశాలను రవీష ఇందులో పొందుపరిచారు. డాక్టర్ ఎస్కే అమీనాబీ, టి.ప్రశాంతి, డాక్టర్ టి.బాలకృష్ణ, బి.సత్యశ్రీ పాల్గొన్నారు.

ఖో-ఖో పోటీలకు 'ఎస్పీఎస్' విద్యార్థులు

గుడివాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖో-ఖో అండర్-18 జూనియర్స్ రాష్ట్రజట్టులో ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తిమోతి, ఆసిఫ్‌ఖాన్, కె.జయసూర్య చోటు సంపాదించారని ప్రధానోపాధ్యాయురాలు టి.రాణి తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్, అలీఘడ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఇటీవల చిత్తూరు జిల్లా, కాణిపాకంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 విభాగంలో జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానం సాధించిందని, అందులో ప్రాతినిధ్యం వహించిన తమ పాఠశాల విద్యార్థులు డి.రాకేష్, సాజిద్‌ఖాన్, అయోధ్య ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. రాష్ట్రజట్టుకు ఎంపికైన విద్యార్థులను గుడివాడ డీవైఈవో పద్మారాణి, డీసీబీ చైర్మన్ షేక్ జాన్‌సాహెబ్, ఖో-ఖో అసోసియేషన్ జిల్లా చీఫ్ ప్యాట్రన్ కొసరాజు అవినాష్, చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు మడకా ప్రసాద్, మద్దినేని సత్యప్రసాద్ అభినందించారు.


రాష్ట్ర జట్టులో చోటు సాధించిన విద్యార్థులు


ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

వీకేఆర్ అండ్ వీఎన్‌బీలో ప్రాంగణ ఎంపికలు

గుడివాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం బెంగళూరుకు చెందిన స్కిల్ ఇంటర్న్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. బీటెక్ ఆఖరి ఏడాదికి 160మంది విద్యార్థులు హాజరవగా, ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి 16, కంప్యూటర్ విభాగం నుంచి 31, మెకానికల్ నుంచి ఒకరు, ఎంబీఏ నుంచి ఒకరు మొత్తం 49మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు తెలిపారు. నియామక పత్రాలు పొందిన విద్యార్థులను కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్లేస్మెంట్ అధికారి నవీన్, ట్రైనింగ్ అధికారి ఎన్.ధనుంజయరావు, డీన్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

అపార్టుమెంట్ పైనుంచి పడి యువకుడి మృతి

పెనమలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అపార్టుమెంట్ పై ఫ్లోరు నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక యువకుడు మృతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కానూరు కామయ్యతోపు వద్ద నివాసముండే గొట్టిపాటి శశాంక్ (36) పెనమలూరు పోలీసుస్టేషను ఎదురుగా చెరుకురసం బండి నడుపుతాడు. మంగళవారం రాత్రి పది గంటలకు అతను నివాసముండే అపార్టుమెంటుపై ఫ్లోర్ నుంచి ప్రమాదవశాత్తూ జారి పడిపోయాడు. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి లో చేర్పించారు. అక్క డ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బకాయిలు చెల్లించాలి: 104 ఉద్యోగులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా 104 ఉద్యోగులకు జీతాలు అందడం లేదని, బకాయిలు చెల్లించా లని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ జి.గీతాబాయికి 104 ఉద్యోగుల సంఘ నాయకులు వినతిపత్రం అందించారు. 2020 తరువాత విధుల్లో చేరిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పీఎఫ్, ఈ ఎస్ఐలు యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 104 ఉద్యోగ సంఘ నాయకులు బి. పవన్, మురళీకృష్ణ, వెంకట్‌తేజ, సుబ్బారావు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో గీతాబాయికి వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.565

రేపటి నుంచి సీపీఎం ప్రజాపోరు

చల్లపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తెలిపారు. గుంటూరు బాపనయ్య భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14వ తేదీన జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఉచిత ఇసుక విధానం అమల్లోకి రాలేదని విమర్శించారు. రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.6072 కోట్ల భారం వేసిందని ఆయన ఆరోపించారు.



బంటుమిల్లి వద్ద 216 జాతీయ రహదారిపై ఆరబోసిన ధాన్యం

ప్రమాదాలకు దారితీసేలా..

● జాతీయ రహదారిపై ధాన్యం రాశులు

(ఆంధ్రజ్యోతి-బంటుమిల్లి): రోడ్డు ప్రమాదాలకు దారితీసేలా 216 జాతీయ రహదారిపై రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. మండలంలోని 216 జాతీయరహదారికి ఇరువైపులా వ్యవసాయ భూములున్నాయి. సార్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. రైతులు యంత్రాలతో కోతలు పూర్తి చేశాక, ఆ ధాన్యాన్ని జాతీయ రహదారులపై పగలు ఆరబెడుతున్నారు. రాత్రికి రాశి చేస్తున్నారు. వాటిపై పరదాలు కప్పి కనిపించకుండా రాళ్లు పెడుతున్నారు. జాతీయ రహదారి కావడంతో వేగంగా వెళ్లే వాహనదారులు వాటి చూసుకోకుండా వెళుతున్నారు. ఇటీవల కాలంలో వాహనాలు ధాన్యం రాశులపైకి వెళ్లడంతో ప్రమాదాలు జరిగి పలువురు గాయపడిన ఘటనలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం 216 జాతీయ రహదారి పెందుర్రు ధాన్యం రాశి వద్ద ఓ ద్విచక్ర వాహనదారుడు అదుపు తప్పి పడిపోయి ప్రాణాలను కోల్పోయాడు. పొడుగులు, ధాన్యం రాశులు రహదారిపై కనిపిస్తున్నా ఎన్‌హెచ్ అధికారులు స్పందించడం లేదు.

ధాన్యం ఆరబెట్టకుండా చూస్తాం

రైతులకు అవగాహన కల్పిస్తాం. రోడ్లపై ధాన్యం రాశులు లేకుండా, ధాన్యం ఆరబెట్టకుండా చూస్తాం. **- గణేష్ కుమార్, బంటుమిల్లి ఎస్సై**

జాతీయ విద్యాదినోత్సవానికి రండి

● మంత్రి కొల్లు రవీంద్రకు డీఈవో రామారావు ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఈనెల 21న జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్న జాతీయ విద్యాదినోత్సవానికి హాజరు కావాలని మంత్రి కొల్లు రవీంద్రను డీఈవో రామారావు ఆహ్వానించారు. మంత్రిని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి నారా లోకేశ్ విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని డీఈవోకు మంత్రి సూచించారు. డీవైఈవో శేఖర్‌సింగ్ పాల్గొన్నారు.



మంత్రి కొల్లు రవీంద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈవో రామారావు

స్నేహితుడి ఇంటికెళ్లి తిరిగిరాలేదు

● పులిగడ్డ-పెనుమూడి వంతెనపై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బైక్.. అందులో ఫోన్, పర్స్

● అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు



సుమంత్ (ఫైల్)

చల్లపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చల్లపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదైంది. నిమ్మలతోటకు చెందిన బొడ్డు సుధాకర్ కుమారుడు సుమంత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వివాహమైంది..ఇద్దరు పిల్లలున్నారు. స్థానికంగా అపార్ట్‌మెంట్‌లో ఉంటూ ఇంటివద్దనే ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం ఉదయం 8గంటలకు స్నేహితుడిని కలిసేందుకు పెదప్రోలు వెళ్లివస్తానని భార్య సుచరితకు చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరాడు. పదకొండు గంటలు తర్వాత బయలుదేరుతున్నట్లు భార్యకు ఫోన్‌లో చెప్పాడు. ఎంతసేపటికీ తిరిగి రాలేదు. కోడలి ద్వారా విషయం తెలుసుకున్న సుధాకర్ బంధుమిత్రులతో కలిసి పెదప్రోలు పరిసర ప్రాంతాలకు వెళ్లిచూసినప్పటికీ కనిపించ లేదు. రేపల్లె వైపు వెళుతుండగా, పులిగడ్డ - పెనుమూడి వంతెనపై సుమంత్ బైక్ కనిపించింది. బైక్‌లో ఫోన్, పర్స్ ఉన్నాయి. పరిసరాల్లో వెతికినా సుమంత్ జాడ లేదు. దీంతో తండ్రి సుధాకర్ చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ పి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

నూతన వంగడాల సాగుతో అధిక దిగుబడులు

మోపిదేవి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే నూతన వంగడాల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏడీఏ జయప్రద సూచించారు. బుధవారం పెదప్రోలులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడారు.

అరకొర సిబ్బందితో సతమతం

బందరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో 31 మంది సిబ్బందికి ఉన్నది 14 మందే..

(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం టౌన్)

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పెరుగుతున్న వాహనాలతో పాటు రద్దీ కూడా పెరుగుతోంది. జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మార్కెట్ల వద్ద రద్దీ పెరుగుతున్నా వాహనాలను నియంత్రించేందుకు తగినంత మంది ట్రాఫిక్ పోలీసులు లేరు. రద్దీగా ఉండే కోనేరుసెంటర్‌లోనూ కొందరు వాహనాలను పార్కింగ్ చేసి విజయవాడ, గుంటూరు వెళుతున్నారు. నగరంలో రోడ్ల మార్జిన్లు ఆక్రమణలకు గురి కావడంతో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. కూరగాయల మార్కెట్, ఫిష్ మార్కెట్ వద్ద, పోర్టురోడ్డు, జవ్వారుపేట సెంటర్లలో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. మూడు స్తంభాల సెంటర్ నుంచి చల్లరస్తా, కోనేరుసెంటర్, రేవతి, లక్ష్మీటాకీసు, జిల్లాపరిషత్, రామానాయుడుపేట, బుటాయిపేట, జవ్వారుపేట, చిలకలపూడి, కాలేఖాన్‌పేట సెంటర్లలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. కలెక్టరేట్ వద్ద ధర్నాలు వంటి సమయాల్లో ట్రాఫిక్ పోలీసుల అవసరం ఏర్పడుతోంది. అరకొర సిబ్బంది కారణంగా విధులు నిర్వర్తించలేక సతమతమవుతున్నారు. నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.



త్వరలో ట్రాఫిక్ సీఐను నియమిస్తాం

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఖాళీగా ఉన్న ట్రాఫిక్ సీఐ పోస్టును త్వరలో భర్తీ చేస్తున్నాం. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా, త్రిబుల్ రైడింగ్ చేసినా చర్యలు తీసుకుంటాం. వ్యాపారులందరూ షాపుల వద్ద సీసీ కెమెరాలు పెట్టుకోవాలి. ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రజలు, వ్యాపారులు సహకరించాలి. చిరు వ్యాపారులు రోడ్డు మార్జిన్లలో ముందుకు రాకుండా సహకరించాలి. పశువుల పెంపకందారులు రోడ్లపై పశువులను వదలకూడదు.

- ఆర్. గంగాధరరావు, జిల్లా ఎస్పీ

నగరం మొత్తానికి ఒక్క ఎస్సైనే..

గతంలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ ఉండేవారు. డీఎస్పీ రిటైరయ్యాక, పోస్టు భర్తీ చేయలేదు. సీఐ పోస్టు ఖాళీగానే ఉంది. రెండు ఎస్సై పోస్టులకు ఒకటి ఖాళీగానే ఉంది. ఒక ఏఎస్ఐ పోస్టు ఖాళీగాఉంది. 31 మంది ట్రాఫిక్ పోలీసులకు 14 మందే ఉన్నారు. 17 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్క ఎస్సై నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి వస్తోంది.

పనిచేయని సిగ్నల్ లైట్లు

ఏడాది క్రితం నగరంలో రూ.30 లక్షలతో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఇవి పనిచేయడం లేదు. రాజాసెంటర్, లక్ష్మీటాకీసు, రేవతీ సెంటర్లలో సిగ్నల్ లైట్ల ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి ఉంది.

కోనేరుసెంటర్‌లో కార్లు పెట్టి వెళ్లిపోతున్నారు



కోనేరుసెంటర్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్ల పార్కింగ్ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చి సాయంత్రం తీసుకెళుతున్నారు. వీటిని నియంత్రిస్తే కొంత వరకు ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయవచ్చు. కోనేరుసెంటర్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించాలని అధికారులను అడుగుతూనే ఉన్నాం. ఉన్నతాధికారులు దృష్టి సారించాలి.

- శ్రవణం శివ, వ్యాపారి, మచిలీపట్నం

ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల అండతో మార్కెట్‌యార్డు రోడ్డులో నిర్మించిన అక్రమ షాపులను మునిసిపల్ అధికారులు తొలగించారు. మూడు స్తంభాల సెంటర్ నుంచి చల్లపల్లికి వెళ్లే రోడ్డులోని ఆక్రమణలను, హౌసింగ్‌బోర్డు కాలనీలో రోడ్ల పక్కన అడ్డదిడ్డంగా నిర్మించిన షాపులను కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో తొలగించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు సచివాలయ అధికారులు పాల్గొన్నారు. నగరంలో మునిసిపల్, రెవెన్యూ స్థలాలు, రోడ్ల మార్జిన్లను ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న మునిసిపల్ కమిషనర్ బాపిరాజు



డీఎంహెచ్‌వో గీతాబాయికి వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

బకాయిలు చెల్లించాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా 104 ఉద్యోగులకు జీతాలు అందడం లేదని, బకాయిలు చెల్లించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ జి.గీతాబాయికి 104 ఉద్యోగుల సంఘ నాయకులు వినతిపత్రం అందించారు. 2020 తరువాత విధుల్లో చేరిన వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్‌ఐలు యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 104 ఉద్యోగ సంఘ నాయకులు బి. పవన్, మురళీకృష్ణ, వెంకట్‌తేజ, సుబ్బారావు పాల్గొన్నారు.



రామలింగేశ్వర స్వామి దేవాలయంలో స్వీట్లు పంచుకుంటున్న అర్చకులు

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

● జీతం రూ.15 వేలకు పెంచడంపై అర్చకుల ఆనందం

మచిలీపట్నం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 50 వేలకు పైగా ఆదాయం ఉన్న దేవాలయాల అర్చకులకు జీతం రూ.15 వేలకు పెంచినందుకు సీఎం చంద్రబాబుకు అర్చకులు, బ్రాహ్మణ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు స్వీట్లు పంచుకున్నారు. బ్రాహ్మణ సంఘాల నాయకుడు గాదె శ్రీనివాసశర్మ, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, భాగవతుల శ్రీనివాస శర్మ, టీడీపీ నాయకుడు ఫణికుమార్, అర్చకుడు ఘంటసాల భాస్కరశర్మ, తంగిరాలకుమార్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మూడువేలకు పైగా దేవాలయాల్లోని అర్చకులకు లబ్ధి చేకూరుతుందన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మచిలీపట్నంలో 9,700 ఓట్లు నమోదు

మచిలీపట్నం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గుంటూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారానికి 9,700 ఓట్లు నమోదయ్యాయి. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ కార్యాలయంలో ఆరు కంప్యూటర్లతో ఓటర్ల నమోదు ఫామ్‌లను ఆన్‌లైన్ చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలోనూ ఓట్ల నమోదు ముమ్మ ంగా జరిగింది.

13న విజయవాడలో రవిశంకర్ సత్సంగం

మచిలీపట్నం టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వ్యవస్థాపకుడు గురుదేవ్ రవిశంకర్ ఈనెల 13న సాయంత్రం 6 గంటలకు విజయవాడ పున్నమిఘాట్‌లోని బబ్బూరి గ్రౌండ్స్‌లో సత్సంగానికి భక్తులు తరలిరావాలని రవిశంకర్ శిష్యులు రుషిదేవరత్ పిలుపునిచ్చారు. బుధవారం మచిలీపట్నం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు జిల్లా పరిషత్ నుంచి కోనేరుసెంటర్ వరకు పాదయాత్ర చేశారు. అనంతరం రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సత్సంగం వాల్‌పోస్టర్లను దేవరత్ ఆవిష్కరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ ఆంజనేయులుతో డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు విరాళం అందజేయిస్తున్న బాషా

చల్లపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని లయన్స్‌క్లబ్ వైస్ గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు అన్నారు. లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ యు.రాంబాబు ఆర్థిక సహకారంతో జాతీయ రహదారికి పక్కనే 50 పండ్ల మొక్కలను నాటారు. వైస్ గవర్నర్ ఆంజనేయులు మొక్కలు నాటి నీరుపోశారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్, జిల్లా క్యాబినెట్ కోశాధికారి నర్రా సాయిబాబు, చల్లపల్లి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులకు లయన్స్‌క్లబ్ పెద్దలు నర్రా సాయిబాబు ఆర్థిక సహాయంతో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లా వైస్ గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు, ఆర్‌సీ రాంబాబు పుస్తకాలను పంపిణీ చేశారు. మన కోసం మనం ట్రస్ట్‌కు లయన్స్‌క్లబ్ పెద్దలు ఎస్‌జీపీ బాషా రూ.10వేల విరాళాన్ని అందజేశారు. జిల్లా వైస్ గవర్నర్ ఆంజనేయులు చేతుల మీదుగా డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు అందజేశారు.

సాఫ్ట్‌బాల్ రాష్ట్ర పోటీలకు శ్రీకాకుళం విద్యార్థులు

ఘంటసాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీకాకుళం జడ్పీ ప్లస్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు ఎ.అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు. గన్నవరంలో మంగళవారం నిర్వహించిన బాలుర జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 విభాగంలో సీహెచ్ సన్ని, అండర్-14 విభాగంలో బి.విష్ణుదత్త, పి.విజయతేజ, అండర్-14 బాలికల విభా గంలో పి.అక్షయ ఎంపికయ్యారని తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీడీ బి.వెంకటేశ్వరరావును అభినందించారు.

గోగినేనిపాలెం విద్యార్థులు 12 మంది..

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ రాష్ట్రస్థాయి బాలబాలికల పోటీలకు గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 12 మంది ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు టి.వేణుగోపాలరావు తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో మునిపల్లి నాగచైతన్య, కుంపటి జశ్వంత్, అండర్-17 సాఫ్ట్‌బాల్ బాలికల విభాగంలో వెంట్రప్రగడ ఐశ్వర్య, అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలుర విభాగంలో గరికముక్కు ఉమాశంకర్, గూడవల్లి నితిన్, బేతపూడి అఖిల్, అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలికల విభాగంలో కొడాలి భవిజ్ఞ, లోకం లహరి, కొడాలి దుర్గ, కుంపటి లాస్య, అండర్-14 బేస్‌బాల్ బాలికల విభాగంలో కుంపటి ప్రణీత, బొడ్డు లక్ష్మీ తిరుపతమ్మ ఎంపికయ్యారని తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీడీ జి.మారుతిని అభినందించారు.

నాగాయలంక విద్యార్థులు 14 మంది..

నాగాయలంక: నాగాయలంక జడ్పీ పాఠశాల విద్యార్థులు 14 మంది సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 బేస్‌బాల్ పోటీలకు గుంటూరు హాసిని, తమ్ము తనుషావల్లీశ్రీ, ఆర్.హరీష్, కె.సంతోష్ బేస్‌బాల్ పోటీలకు ఎం.దివ్య, కె.జాహ్నవి, పి.లీల శ్రీ, టి.యశ్వంత్ సాయి, అండర్- 14 సాఫ్ట్‌బాల్ విభాగంలో పి.హాసిని, ఎస్.జ్యోతి రాణి, కె.వీరేంద్ర, అండర్-14 బేస్‌బాల్‌కు ముమ్మారెడ్డి సిరి, టి.రాహుల్ ఎంపికయ్యారు. హెచ్ఎం పి.వి.ఎస్.వి.ప్రసాద్, పీడీ లక్ష్మీప్రసాద్, పూర్ణచంద్రరావు, పీఎంసీ చైర్మన్ వి. లీలామారుతి అభినందించారు.

వంట ఏజెన్సీ కార్మికురాలిని తొలగించొద్దు

పెడన, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాలుగో వార్డులోని ఉర్దూ స్కూల్‌లో వంట ఏజెన్సీలో పనిచేస్తున్న ముంతాజ్ జహను తొలగించాలని ప్రధానోపాధ్యాయురాలు ప్రయత్నిస్తున్నారని సీపీఐ నాయకుడు తుమ్మా చినకొండయ్య ఆరోపించారు. ముంతాజ్ భర్తను కోల్పోయి దుఃఖంలో ఉందని ఆమెను తొలగించొద్దంటూ బుధవారం ఎంఈవోకు ఆయన వినతిపత్రం ఇచ్చారు. తొలగిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రైతులకు ఆశాజనకంగా ఆయిల్‌పామ్

● సాగు వైపు దృష్టి సారించండి: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



పాపవినాశనం లంకలో ఆయిల్‌పామ్ మొక్కను నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహకాలిస్తున్నాయి. ఆయిల్ పామ్ సాగు రైతులకు ఆశాజనకంగా ఉంటుంది. 5 వేల ఎకరాల్లో సాగు చేస్తే ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. నియోజకవర్గంలోని ఏకైక పరిశ్రమ కేసీపీ షుగర్స్ మూతబడింది. పామాయిల్ పరిశ్రమను ఏర్పాటు చేసుకోవచ్చు. రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి' అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. పాపవినాశనం లంకలో రైతు, మాజీ సర్పంచ్ మునిపల్లి బుజ్జి పొలంలో ఆయిల్‌పామ్ సాగును బుధవారం ఆయన ప్రారంభించారు. రైతు లు, ప్రభుత్వం, ఉండవల్లి ఆగ్రోస్ ఒప్పందం ద్వారా పంట విస్తీర్ణం పెంచేం దుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు డీహెచ్‌వో జ్యోతి తెలిపారు. ట్రైపాడ్ అగ్రి మెంట్ ప్రకారం రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఉండవల్లి ఆగ్రోస్ డీజీఎం హరికృష్ణ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ఆశమ్మ(ఫైల్)

మోపిదేవి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామానికి చెందిన శతాధిక వృద్ధు రాలు కంచర్ల అనంత ఆశమ్మ(105) వృద్ధా ప్యంతో మృతి చెందారు. గత నెలలో ఆశమ్మ 105వ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమా ర్తెలు ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ కుటుంబసభ్యుల సహాయంతో ఆమె ఓటు వేశారు. వారం రోజులుగా అనారోగ్యంతో ఉంటూ మంగళవారం మృతి చెందారని కుటుంబసభ్యులు పేర్కొన్నారు.